గురువారం
10-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 198
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

విక్టరీ డే పరేడ్‌కు రండి: మోదీకి పుతిన్ ఆహ్వానం

మాస్కో: రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీపై గెలుపుకు గుర్తుగా విక్టరీ డేను రష్యా ఏటా మే 9న ఘనంగా నిర్వహిస్తుంది. ఈ ఏడాది జరగబోయేది 80వ విక్టరీ పరేడ్ కావడంతో తమ మిత్రదేశాల అధినేతలందరినీ రష్యా ఆహ్వానిస్తోంది. ఇదే క్రమంలో భారత ప్రధానికి ఆహ్వానం పంపింది. ఈమేరకు రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆండ్రే రుడెంకో వెల్లడించారు. 'ఇప్పటికే భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపాం. ఆయన పర్యటన కోసం ఏర్పాట్లు చేస్తున్నాం' అని రష్యా వార్తా సంస్థ టాస్‌తో రుడెంకో చెప్పారు. 1945 జనవరిలో సోవియట్ సైన్యం జర్మనీపై యుద్ధం మొదలు పెట్టగా... జర్మనీ బేషరతుగా లొంగుబాటుకు మే9న ఒప్పందం జరగడంతో ఆ యుద్ధం ముగిసింది.

దేశంలో మోదీ చిచ్చు

- బీజేపీ విభజన రాజకీయాలు అడ్డుకుందాం
- తెలంగాణలో కాషాయ పార్టీకి అవకాశం ఇవ్వం
- బ్రిటిషర్ల కంటే ప్రమాదకారులు
- ఏఐసీసీ ప్లీనరీలో రేవంత్ ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశంలో మతాల మధ్య ప్రధాని మోదీ చిచ్చుపెడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మహాత్మాగాంధీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ బుధవారం గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఏఐసీసీ ప్లీనరీ సమావేశంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ విభజన రాజకీయాలను కాంగ్రెస్ అడ్డకుంటుందన్నారు. గాడ్సే ఆలోచన విధానాన్ని వ్యాపింపజేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ ... రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకురాగా వాటికి వ్యతిరేకంగా రైతులు సుమారు 15 నెలలు ధర్నాలు చేసినా కనీసం ప్రభుత్వం చర్చలకు రాలేదని ధ్వజమెత్తారు. మణిపూర్‌లో మంటలు రాజేయడంతో పాటు దేశవాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం చేశారని విమర్శించారు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేయడంతో పాటు, కుల గణన చేసి చూపించామన్నారు. మోదీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయి కాని ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు యువతకు రాలేదని అన్నారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వమని గుజరాత్ గడ్డ నుండే చెబుతున్నానని రేవంత్ పేర్కొన్నారు. మాకు

- మిగతా 2 లో

అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకం

బీజింగ్: అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనా సైతం తగ్గేదేలే అంటోంది. రెండు దేశాలూ ఢీ అంటే ఢీ అంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదే స్థాయిలో తిప్పికొడుతోంది. డ్రాగన్ దేశం నుంచి వచ్చే వస్తువులపై ట్రంప్ 104 శాతం సుంకం విధించిన నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై తాము 84 శాతం సుంకం విధిస్తున్నట్లు బీజింగ్ తాజాగా ప్రకటించింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల చైనాపై

- మిగతా 2 లో

సీఆర్ స్ఫూర్తిప్రదాత

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సి.రాజేశ్వరరావు (సీఆర్) స్ఫూర్తి ప్రదాతని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. సీఆర్ 31వ వర్ధంతిని పురస్కరించుకొని న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయన విగ్రహం, చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, పల్లబ్ సేన్ గుప్తా, డాక్టర్ బలచంద్ర కాంగో, సయ్యద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, అనీరాజా, గిరీశ్ చంద్ర శర్మ కూడా పుష్పాంజలి ఘటించారు. సీఆర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం ఆదర్శనీయమని నాయకులు కొనియాడారు. సీఆర్ తుది వరకు పార్టీ కోసం పనిచేశారన్నారు. ఆయన తన జీవితాన్ని బడుగు, బలహీనుల పక్షాన పోరాటాలకు అంకితమిచ్చారని శ్లాఘించారు. ఆయన సుదీర్ఘకాలం సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధ కార్మికురాలికి రూ.4 కోట్ల పన్ను నోటీసు

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో ఒక నిరుపేద వృద్ధ కార్మికురాలికి ఏకంగా రూ.4 కోట్ల ఆదాయం ఉందని, రిటర్న్ దాఖలు చేయాలంటూ ఆదాయ పన్ను విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. సబ్రా అనే వృద్ధురాలు జస్రన పట్టణంలోని మురికివాడలో తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరిద్దరు దినసరి కూలీలుగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021-22 ఏడాదికి రూ.4.88 కోట్లకు పైగా ఆదాయంపై టాక్స్ కట్టాలని నోటీసులు జారీ చేశారు. ఆమెకు చదవడం రాకపోవడంతో అప్పుడు నోటీసులకు స్పందించలేదు. అయితే

- మిగతా 2 లో

చిరస్మరణీయుడు సీఆర్

వర్ధంతి సభలో నేతల ఘన నివాళి

విశాలాంధ్ర - కొత్తగూడెం బ్యూరో/హైదరాబాద్: దేశంలో భూపోరాలకు శ్రీకారం చుట్టి, జీవితకాలం నిరుపేదల పక్షాన నిలిచిన కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

- మిగతా 2 లో

'వక్ఫ్'పై సుప్రీంలో సీపీఐ పిటిషన్



న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ చట్టం అమల్లోకి రావడంతో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బుధవారం న్యాయవాది రామ్‌సాగర్ ద్వారా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టం-2025 చట్టబద్ధతను

- మిగతా 2 లో

హైదరాబాద్ 4 గంటలే!

అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకి కేంద్రం పచ్చజెండా

డీపీఆర్ రూపకల్పనపై చర్యలకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నగరం ఏపీకి మరింత చేరువకానుంది. అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే నాలుగు గంటల వ్యవధిలోనే హైదరాబాద్ చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలపై ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ పంపించింది. అలాగే తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటు చేయాలని

- మిగతా 2 లో

ముస్లింల మత స్వేచ్ఛపై దాడి

- వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం
- క్రైస్తవులు, సిక్కులపైనే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ గురి
- కులగణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- ఏఐసీసీ సదస్సులో రాహుల్ గాంధీ

అహ్మదాబాద్: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ చట్టాన్ని తేవడమంటే ముస్లింల మత స్వేచ్ఛపై దాడి చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. క్రైస్తవులు, సిక్కుల వంటి ఇతర మైనారిటీల హక్కులను హరించడమే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ తదుపరి లక్ష్యమని హెచ్చరించారు. గుజరాత్, అహ్మదాబాద్‌లో సబర్మతి నది తీరాన జరిగే ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించే సుంకాల ఒత్తిళ్లకు మోదీ ప్రభుత్వం తలొగ్గడంతో ఆర్థిక తుపాను రాబోతోందని హెచ్చరించారు. 'ట్రంప్‌ను మోదీ హత్తుకున్న ఫొటో చూశారా? ఈసారి కౌగిలించుకోం... కొత్త టారిఫ్‌లు విధిస్తామని ఆయన (ట్రంప్) మోదీకి స్పష్టంచేశారు. ప్రధాని మాత్రం మౌనం వహించారు. దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసం రెండు రోజులు పార్లమెంటులో నాటకమాడారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధాని ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌తో మోదీ ఇటీవల భేటీ కావడాన్ని ప్రస్తావిస్తూ... 'బంగ్లాదేశీ నాయకుడు ప్రతికూల వ్యాఖ్యలు చేస్తుంటే మోదీ పక్కనే కూర్చొని విన్నారు. ఆయన 56 అంగుళాల ఛాతీ ఏమైంది' అంటూ ప్రధానిని రాహుల్ ఎద్దేవా చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ మ్యాగజైన్ ఇటీవల ప్రచురించిన వ్యాసాన్ని ప్రస్తావిస్తూ... క్రైస్తవులు, సిక్కుల హక్కులు, ఆస్తులపై బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కన్ను పడిందన్నారు. ఈ మైనారిటీలే వారి తదుపరి లక్ష్యమని వ్యాఖ్యానించారు. కులగణన గురించి మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగిస్తామని, తెలంగాణలో చేసినట్టే దేశం మొత్తం చేస్తామని రాహుల్ ప్రకటించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. దేశ వ్యవస్థలన్నీ తమ గుప్పెట్లో ఉండాలని వారు కోరుకుంటారని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం సులువు కాదని, ఇందుకోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులకు రాహుల్ పిలుపునిచ్చారు. ఎల్లప్పుడు నిజం పక్షాన, ప్రజల పక్షాన నిలవాలన్నారు. వివాదాస్పద అగ్నిపథ్ పథకాన్ని కూడా ప్రస్తావించారు. 'మీరు అగ్నివీర్‌గా ఉండి, యుద్ధంలో చనిపోతే అమర సైనికుడి హోదా కానీ పింఛన్ కానీ మీకు రాదు. మీ పక్కవారికి వస్తుంది అని యువతతో మోదీ ప్రభుత్వం చెబుతోంది' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో దళితులు, వెనుకబడిన వర్గాల అణచివేతను ఆక్షేపించారు. కుల గణన జరిగితే తప్ప సామాజిక సమ న్యాయం సాధ్యం కాదని స్పష్టంచేశారు. వాస్తవాలను కప్పిపుచ్చేందుకే కుల గణనకు మోదీ సర్కారు ముందుకు రావడం లేదన్నారు. ఎంత దాచినా నిజం దాగదని, కులగణన జరిగి తీరుతుందని రాహుల్ నొక్కిచెప్పారు. వందేళ్ల కిందట మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడయ్యారని, 150 కిందట సర్దార్ వల్లభాయి పటేల్ జన్మించారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ పార్టీకి మూలమని అన్నారు. అణగారిన వర్గం కోసం పనిచేసే నాయకుడిగా తన గురించి చెప్పుకున్నారు. ఐక్యంగా ముందుకెళితేనే విజయం సొంతం కాగలదని, తమ ముందరున్న సవాళ్లు సంక్లిష్టమైనవని, పోరాట క్రమంలో ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

'న్యాయపథ్'కు ఆమోదం

భారతీయులంతా ఐక్యంగా ఉండటమే తమ జాతీయవాదమని, పౌరులను విభజించడమే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్

- మిగతా 2 లో

కేంద్ర మంత్రి మాంఝీ మనవరాలి హత్య

గయ: బీహార్ మాజీ సీఎం, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన మనవరాలు సుష్మాదేవి (32) తన భర్త చేతిలోనే హత్యకు గురయ్యారు. ఈ ఘటన బీహార్‌లోని గయ జిల్లా టెటువా గ్రామంలో చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య ఘర్షణే ఈ హత్యకు కారణమని అనుమానిస్తున్నారు. సుష్మాదేవి తన పిల్లలు, సోదరి పూనమ్ కుమారితో కలిసి ఇంట్లో ఉన్న సమయంలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పూనమ్ తెలిపిన వివరాల

- మిగతా 2 లో

ఇదీ లోకం!



సార్..నాకో డౌటు, వీళ్లకి బీపీ జగన్ హయాంలో వచ్చిందంటారా? లేక, మీ పాలనలోనా?

'తిరుపతి-కాట్పాడి' రైల్వే లైన్ డబ్లింగ్

- రూ.1,332 కోట్లు మంజూరు
- సీఏడీడబ్ల్యూఎం పథకానికి ఓకే
- రైల్వే ఇన్ఫ్రాకు రూ.1,875 కోట్లు...
- ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1600 కోట్లు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

2లో

గ్యాస్, పెట్రో ధరలు తగ్గించండి

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరికి కేటీఆర్ లేఖ



విశాలాంధ్ర -హైదరాబాద్: పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా ధరల పెంపుతో సామాన్యులపై అదనపు భారం పడి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి కేటీఆర్ లేఖ రాశారు. ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డీజిల్, ఎల్.పి.జి ధరలు భారత్ లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా

- మిగతా 2 లో

డాంగే జీవితంలో ఎగుడు దిగుళ్లు

మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రగానీ, కార్మికోద్యమ చరిత్రగానీ శ్రీపాద అమృత డాంగే పేరెత్తకుండా పూర్తి కాదు. డాంగే 1925లో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మార్క్సిస్టు సిద్ధాంతవేత్తల్లో కూడా డాంగే అగ్రగణ్యులు. సాధారణంగా కమ్యూనిస్టు పార్టీలకు అధ్యక్షులు ఉండరు. కేవలం ప్రధాన కార్యదర్శులు మాత్రమే ఉంటారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

పొరుగు దేశాలతో వ్యూహాత్మక బంధం బలోపేతం

వాణిజ్య యుద్ధంలో విధానపరంగా ముందుకు: బీజింగ్ సదస్సులో జిన్‌పింగ్

బీజింగ్: పొరుగు దేశాలతో వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, అమెరికాతో వాణిజ్య యుద్ధం క్రమంలో విధానపరంగా ముందుకెళ్లాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సంకల్పించారు. ఈ ప్రతికూల పరిస్థితులను దీటుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పొరుగు దేశాలతో కలిసి పనిచేసే సమాజాన్ని నిర్మించాలని, ఇందుకోసం కొత్త వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని సూచించారు. చైనా రాజధాని బీజింగ్‌లో మంగళ, బుధవారాలు జరిగిన సదస్సులో జిన్‌పింగ్ పాల్గొన్నారు. పొరుగు దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకోవాలని, తమ మధ్య విభేదాలను పరిష్కరించుకోవాలని సంకల్పించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో సరఫరా గొలుసుల బంధాలను పెంచుకోవాలని, పొరుగు దేశాలతో సహకారాన్ని మెరుగు పర్చుకోవాలని నిర్ణయించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలతో

విరుచుకుపడ్డారు. ముఖ్యంగా చైనాపై గురిపెట్టారు. ఆ దేశం నుంచి అమెరికాకు ఎగుమతులపై 104 శాతం సుంకాలు విధిస్తామంటూ ప్రకటించారు. ఈ క్రమంలో జిన్‌పింగ్ తొలిసారి బహిరంగంగా ప్రసంగించడానికి ప్రాధాన్యత ఏర్పడింది. తమ దేశం వాణిజ్యపరంగా తీసుకోబోయే చర్యలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. నవశకంలో ఇరుకు పొరుగు దేశాలతో పంచుకున్న అనుభవాలు, సాధించిన విజయాలను వివరించారు. శాస్త్రీయ కోణంతో ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేశారు.

తదుపరి పొరుగు దేశాలకు సంబంధించి తీసుకునే చర్యలు, పంచుకునే లక్ష్యాలు, ఆలోచనలపై చర్చించారు. ప్రధాని లీ కియాంగ్ అధ్యక్షత ఈ సదస్సు జరిగింది. కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు హాజరయ్యారు. ట్రంప్ తీరు మార్చుకోకుండా వాణిజ్య యుద్ధాన్ని తీవ్రతరం చేస్తే తాము తుది వరకు పోరాడాలని చైనా సంకల్పించింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం కారణంగా జపాన్, దక్షిణ కొరియా తదితర పొరుగు దేశాలతో సంబంధాలు చక్కబెట్టుకోవడంపై ఐదేళ్లలో మొదటిసారిగా దక్షిణ కొరియా, జపాన్, చైనా మధ్య వాణిజ్యపరంగా చర్చలు జరిగాయి. మూడు దేశాల వాణిజ్య మంత్రులు భేటీ అయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ప్రాదేశికంగా, అంతర్జాతీయంగా ప్రోత్సహించడంపై చర్చించారు. దృష్టి పెట్టింది. గత నాలుగేళ్లుగా ప్రతిష్ఠంభనను ఎదుర్కొంటున్న భారత్-చైనా మధ్య సంబంధాల్లోనూ ఇటీవల పురోగతి కనిపించింది. సుంకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్-చైనా ఏకం కావాలని ఇటీవల భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పిలుపునిచ్చింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్‌ఐ) కింద తమ పొరుగు దేశాలతో పాటు ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంచుకోవాలని చైనా యత్నిస్తోంది.

మా జీతాలు పెంచండి

గ్రీస్‌లో కార్మికుల సమ్మె

నిలిచిన నౌకలు, విమానాలు, రైళ్లు

ఏథెన్స్: అధిక ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, గౌరవప్రదంగా జీవించేందుకు సముచితంగా వేతనాలను పెంచాలని గ్రీస్ కార్మికులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలంటూ బుధవారం 24 గంటల దేశవ్యాప్త సమ్మె చేశారు. ఇదే క్రమంలో రోడ్డు, వాయు, జల రవాణాను స్తంభింపజేశారు. రైళ్లు, ట్రామ్‌ల సేవలను నిలిపివేశారు. గ్రీస్‌లోని అతిపెద్ద కార్మిక సంఘాల అధ్వర్యంలో దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నినాదాలిచ్చారు.

బ్యానర్లు ప్రదర్శించారు. కార్మికుల సమ్మెతో నౌకలు, ఫెర్రీలు పోర్టులకు పరిమితం కాగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. రైళ్లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. 2009-2018లో గ్రీస్ రుణ సంక్షోభాన్ని ఎదుర్కొంది. దీంతో వేతనాల్లో, పింఛన్లలో భారీగా కోతలు పడ్డాయి. బెయిలవుట్‌ల విలువ 290 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ ఏడాది ఆర్థిక వృద్ధి 2.3శాతంగా ఉంది. 2019 నుంచి కనీస వేతనాన్ని 880 యూరోలకు కన్జర్వేటివ్ ప్రభుత్వం పెంచింది కానీ పెరిగిన ధరల దృష్ట్యా ఇది చాలదని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. ప్రైవేటు, ప్రభుత్వ రంగ కార్మికుల జీతాలను పెంచాలని డిమాండ్ చేశాయి. నిత్యావసరాల ధరలు పెరిగాయి. ఇళ్లు ఖరీదుగా మారాయి. విద్యుత్ చార్జీలు పెరిగాయి. ఏమి కొనలేని ఏమి తినలేని పరిస్థితి నెలకొంది. 2019తో పోల్చుకుంటే 10 శాతం తక్కువ సరుకులను కొనగలుగుతున్నాం' అని రెండు మిలియన్ల మంది ప్రైవేటు రంగ కార్మికులకు ప్రాతినిధ్యం వహించే జీఎస్‌ఈఈ ప్రతినిధి చెప్పారు. చాలీచాలని జీతాలతో కార్మికులు ఇల్లు గడవక కష్టాలు పడుతున్నారన్నారు. వేతనాల్లో పెంపుదల కోసం డిమాండ్‌తో సమ్మె చేపట్టామని అన్నారు.

తక్షణమే జీతాలు పెంచండి... లేబర్ కాంట్రాక్టులు పెంచండి అని డిమాండ్ చేశారు. కాగా, కార్మికుల సమ్మెతో సెంట్రల్ ఏథెన్స్ స్తంభించింది. బస్సులు, ట్రాలీలు, రైళ్లు, ట్రామ్‌లు నిలిచిపోయాయి. కమర్షియల్ ఫ్లైట్‌లు గురువారం అర్ధరాత్రి వరకు రద్దు అయ్యాయి.

డొమెనికన్ రిపబ్లిక్ నైట్ క్లబ్ సీలింగ్ కూలిన ఘటనలో 113కు పెరిగిన మృతులు

శాంటో డొమింగో: డొమెనికన్ రిపబ్లిక్‌లోని ఐకానిక్ నైట్ క్లబ్ సీలింగ్ కుప్పకూలింది. ఈ ఘటనలో 113 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే చాలా మందిని కాపాడినట్లు రెస్క్యూ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన జరిగినప్పుడు క్లబ్‌లో వెయ్యి మంది వరకు ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. 24 గంటల గడిచినప్పటికీ శిథిలాల కింద చిక్కుకొన్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలను ముమ్మరంగా సాగిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ప్రముఖ గాయని రుబీ పెరెజ్ సంగీత కచేరి ఉండటంతో ఈ క్లబ్ కిటకిటలాడింది. బాధితుల్లో మాంటెక్రిస్టీ, నార్త్-వెస్టరన్ ప్రావిన్స్ గవర్నర్, బేస్‌బాల్ స్టార్ ఆటగాడు నెల్సన్ క్రజ్ సోదరి నెల్సీ క్రజ్ ఉన్నారు.

'తిరుపతి-కాట్పాడి' రైల్వే లైన్ డబ్లింగ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 104 కిమీల తిరుపతి-పాకాలా-కాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో పంజాబ్-హర్యానా మధ్య 19.2 కిమీల జిరాక్పూర్ బైస్ అధీనంలోని ఆరు లేన్ల నిర్మాణానికి అంగీకరించింది. రూ.1,878 కోట్ల రైల్వే ఇన్ఫ్రా, రూ.1600 కోట్ల ఇరిగేషన్ ప్రాజెక్టులనూ ఆమోదించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్- తమిళనాడు మధ్య తిరుపతి-పాకాలా-కాట్పాడి సింగిల్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టును ఆమోదిస్తూ, ఇందుకోసం రూ.1,332 కోట్లను మంజూరు చేసింది. ప్రధానమంత్రి క్రిషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) ఉప పథకంలో భాగంగా 2025-26 కోసం రూ.1,600 కోట్లతో కమాండ్ ఏరియా అభివృద్ధి, జల నిర్వహణ (ఎం-సీఏడీ డబ్ల్యూఎం)కు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తిరుపతి-పాకాలా-కాట్పాడి డబులింగ్ ప్రాజెక్టు వల్ల తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట వంటి ప్రముఖ క్షేత్రాలకు వచ్చే లక్షలాది భక్తులకు ప్రయోజనం ఉంటుందన్నారు. వైద్య, విద్య హబ్‌లుగా తిరుపతి, వెల్లూరు ప్రాంతాలు ఉంటే రవాణా సౌకర్యాలు మెరుగవుతాయన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 17 ప్రధాన వంతెనలు, 327 చిన్న వంతెనలు, ఏడు పై వంతెనలు, 30 అండర్‌పాస్‌లను నిర్మించనున్నట్లు వైష్ణవ్ తెలిపారు. డబ్లింగ్ పనులు పూర్తైతే రోడ్డు మార్గంలో రద్దీ తగ్గుతుందని, రైలు మార్గం ఎక్కువగా వినియోగమ వుతుందని అన్నారు. తద్వారా 20 కోట్ల కిలోల కర్బన ఉద్గారం తగ్గుతుందని చెప్పారు. నాలుగు కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అవుతుందని కూడా అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఇప్పటికే సర్వే పనులు పూర్తి అయినట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టుతో భారతీయ రైల్వే నెట్‌వర్క్ 113 కిమీల మేరకు విస్తరిస్తుందని చెప్పారు. అలాగే, రూ,1,878 కోట్ల వ్యయ అంచనాతో పంజాబ్-హర్యానాలో ఎన్‌హెచ్-7 (జిరాక్పూర్-పాటియాలా) నుంచి ఎన్‌హెచ్-5 (జిరాక్పూర్- పర్వానూ) వరకు 19.2 కిమీల ఆరు లేన్ల జిరాక్పూర్ బైపాస్‌కు కేబినెట్ ఆమోదం లభించినట్లు వెల్లడించారు. పాటియాలా, దిల్లీ, మొహాలీ ఎయిరో సీటీ నుంచి ట్రాఫిక్ మళ్లించడం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలు, జిరాక్పూర్, పంచ్‌కులా వద్ద రద్దీ తగ్గించడానికి ఈ ప్రాజెక్టు దోహదమవుతుందని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌తో నేరుగా అనుసంధానం అవుతుందన్నారు. ఎన్‌హెచ్-7, ఎన్‌హెచ్-5, ఎన్‌హెచ్-5 మీద రద్దీతో పాటు ప్రయాణ సమయం తగ్గడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ ట్రాన్స్‌ఫర్ (ఐఎంటీ) ద్వారా వాటర్ యూజర్ సొసైటీ (డబ్ల్యూయూఎస్) కోసం ఇరిగేషన్ ఆస్తుల నిర్వహణ ప్రాజెక్టునూ కేబినెట్ ఆమోదించింది. ప్రస్తుతమున్న కాలువలు, ఇతర నిర్దేశిత క్లస్టర్ల నుంచి నీటి సరఫరాకు అనుకూలమైన మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాజెక్టును కేబినెట్ ఆమోదించినట్లు వైష్ణవ్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీలు), వ్యవసాయోత్పత్తుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) వంటి వాటితో అనుసంధానం ద్వారా వాటర్ యూజర్ సొసైటీలకు ఐదేళ్ల దాకా సహకారం లభిస్తుందని అన్నారు.

నీటిపారుదల ఆధునిక పద్ధతులను అనుసరించడంతో యువతను వ్యవసాయం వైపునకు ఆకర్షించే అవకాశం ఉంటుందని వైష్ణవ్ చెప్పారు. అలాగే, దేశంలోని వివిధ ఆగ్రో-క్లైమేట్ జోన్లలో 78 పైలట్ ప్రాజెక్టులకు ప్రాథమిక ఆమోదం లభించింద న్నారు. ఈ ప్రాజెక్టుల ప్రయోగాత్మక అమలుతో పొందే అనుభవం ఆధారంగా 16వ ఆర్థిక కమిషన్ కాలంలోనే 2026, ఏప్రిల్ నుంచి కమాండ్ ఏరియా అభివృద్ధి-జల నిర్వహణ జాతీయ ప్రాణాళిక విడుదలవుతుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

'వక్ఫ్'పై సుప్రీంలో సీపీఐ పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

సవాల్ చేశారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'సోషలిజం, కమ్యూనిజం విప్లవ సారథిగా మైనారిటీలు, వెనుకబడిన, అణగారిన వర్గాల సామాజిక-ఆర్థికాభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతరం పోరాడుతోంది. దేశ ముస్లింల ప్రాథమిక హక్కులను హరించేందుకు మార్గం సుగమం చేసే వక్ఫ్ వసరణ బిల్లు-2025 ఉపసంహరణకు డిమాండ్ చేసింది. డీఎంకేతో పొత్తు క్రమంలో ఆ పార్టీ అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 27న తమిళనాడు అసెంబ్లీలో చేసిన తీర్మానానికి సీపీఐ మద్దతు తెలిపింది. ప్రజలు వ్యతిరేకించినాగానీ వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సభ్యులతో కానీ ఇతర భాగస్వాములతో కానీ తగిన రీతిలో సంప్రదింపలేదు. కమ్యూనిస్టు పార్టీ అభ్యంతరాలను, లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఏప్రిల్ 6వ తేదీన వక్ఫ్ సవరణ చట్టం నోటిఫై అయింది.

దీంతో ముస్లింల ప్రాథమిక హక్కులపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ చట్టాన్ని వెంటనే అమల్లోకి తేవడంతో తమిళనాడులోని 50 లక్షల మంది ముస్లింలతో పాటు దేశంలోని ఇతర భాగాల్లో ఉన్న 20 కోట్ల మంది ముస్లింల హక్కుల ఉల్లంఘనకు గురికావడమే కాకుండా ఆ వర్గంపై పక్షపాతం చూపడమే అవుతుంది. ఇందుకోసమే వక్ఫ్ సవరణ చట్టంలోని నిబంధనలను సీపీఐ, డీఎంకే సవాల్ చేశాయి. ఈ చట్టం చట్టబద్ధతను సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. సీపీఐ తాజాగా సుప్రీంలో రిట్ పిటిషన్ దాఖలు చేసింది' అని ప్రకటన పేర్కొంది.

ఉగ్ర చర్యలకు పాల్పడుతున్నట్లు వారే చెబుతున్నారు: జైశంకర్

న్యూఢిల్లీ: భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నామని పాకిస్థాన్‌లో కొంతమంది బహిరంగంగానే చెబుతున్నారని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. న్యూస్18 రైజింగ్ భారత్ సమ్మిట్‌లో భాగంగా మంత్రి మాట్లాడుతూ... పాకిస్థాన్ వైఖరిపై విరుచుకుపడ్డారు. 'ఇదంతా నేను చెప్పాల్సిన పనిలేదు. కళ్లకు కనిపిస్తోంది. వారే చెప్తున్నారు కూడా. భారత్‌లో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నట్లు గర్వంగా ప్రకటించే వ్యక్తులు పాకిస్థాన్‌లో ఉన్నారు. మీరొక టెర్రరిజం ఇండస్ట్రీని ప్రారంభిస్తే... అదే మిమ్మల్ని దెబ్బతీస్తుందని ఎంతోమంది చెప్పారు. ఇప్పుడు మనం చూస్తున్నది అదే. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల నేడు పాక్ మూల్యం చెల్లించుకుంటోంది. నేను మీతో ఉదయం మంచిగా ఉండి.. రాత్రికి మీ ఇంటిపై వచ్చి దాడి చేస్తే మీకు ఓకేనా? అలాంటివారితో కలిసి ఉంటారా?' అని జైశంకర్ ప్రశ్నించారు. 26/11 ముంబై దాడుల్లో కీలక సూత్రధారి తహవూర్ రాణా అప్పగింతపై స్పందిస్తూ... అమెరికా కోర్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బలోచిస్థాన్‌లోని అస్థిరతపై మాట్లాడేందుకు నిరాకరించారు.

హైదరాబాద్ 4 గంటలలే !

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ, అందుకుగల అవకాశాలను పరిశీలించాలని పెట్రోలియం శాఖకు హోం సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని, రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని, దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

దేశంలో మోదీ చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇస్తే తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించిందన్నారు. గాంధీజీ ... బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీపై లాఠీ ప్రయోగం చేయలేదని గుర్తు చేశారు. చివరకు స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారని ఆరోపించారు. బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులని, బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకం

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా కూడా నిర్ణయించింది. దీంతో భగ్గుమన్న ట్రంప్ ఏప్రిల్ 8లోగా చైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. లేకుంటే అదనంగా మరో 50 శాతం ప్రతీకార సుంకం విధిస్తానన్నారు. ఇచ్చిన గడువులోగా చైనా స్పందించకపోవడంతో తాను చెప్పినట్లుగానే చేశారు. గతంలో విధించిన 54 శాతానికి అదనంగా 50 శాతం జోడించడంతో చైనాపై విధించిన సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి. అమెరికా అహంకారంతో వ్యవహరిస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని చైనా రోపించారు. ప్రతిగా మరో 50 శాతం సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించింది.

వెలిగొండ ఆయకట్టుకు వచ్చే జూన్‌కు నీరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వెలిగొండ రిజర్వాయర్ ను 2026 జూన్ కల్లా నింపి సదరు ఆయకట్టు రైతులకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దానికనుగుణంగా పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై, అమరావతి సచివాలయంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా నిమ్మల మాట్లాడుతూ వెలిగొండ పై చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పరుగులు పెట్టిస్తుండగా, జగన్ హయాంలో వెలిగొండను పూర్తి చేసేసినట్లు పచ్చి అబద్ధాలు ఆడారు. జాతికి అంకితం కూడా చేసేసారు. జగన్ అబద్ధాల పాలనకు ఇది పరాకాష్ఠ అంటూ నిమ్మల దుయ్యబట్టారు. మోసం, దగాతో ప్రజల్ని భ్రమింప చేయటంలో జగన్ ను మించిన వారెవరూ లేరన్నారు. ఇప్పటివరకు 7 వింతలే తెలుసు. చేయని పనులు చేశామని, వాటికి ప్రారంభోత్సవాలు కూడా చేసేయడం ప్రజలు ఎనిమిదో వింతగా భావిస్తున్నారని నిమ్మల ఎద్దేవా చేశారు.

ఇదే తరుణంలో పాలనాదక్షత గల తమ ముఖ్యమంత్రి చంద్రబాబు 30 ఏళ్ల క్రితం తాను ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు, ఇంకా పూర్తవకపోవడం పై ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. నిర్వాసితులకు 880 కోట్లు పరిహారం అందించాల్సి ఉండగా, జగన్ ఒక్క రూపాయి పరిహారం అందించ లేదన్నారు. వెలిగొండ పూర్తవ్వాలంటే ఇంకా 4వేల కోట్లు కావాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆగిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను పునరుద్దరిం చామన్నారు. టన్నెల్ లో ఉన్న టీబీఎం మెషిన్ తొలగించడానికి కోర్టు కేసు అడ్డంకి గా ఉన్న నేపథ్యంలో, బైపాస్ టన్నెల్ నిర్మాణం, సాధ్యా సాధ్యాలపై చర్చిస్తున్నామని వివరించారు. హెడ్ రెగ్యులేటర్, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, పునరావాస కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

చిరస్మరణీయుడు సీఆర్

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని శేషగిరిభవన్, హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయం ముగ్దుంభవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జమీందారి కుటుంబంలో జన్మించిన చంద్ర ... కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేసిన త్యాగజీవి అని కొనియాడారు. పేదలకు, శ్రామిక వర్గాలకు భూమి దక్కితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సీఆర్... దేశవ్యాప్త భూపోరాటాలకు నాందిపలికారన్నారు. మహిళలపై దాడులు, అరాచకాలపై చేసే ఉద్యమాలను అణిచివేతకు పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఆరు దశాబ్దాల క్రితమే జనసేవాదళాలు ఏర్పాటు చేసిన ముందు చూపున్న మహానేత అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనించి ప్రజా ఉద్యమాలను నిర్మించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన, నిజమైన నివాళి అని పేర్కొన్నారు. బనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై ఏఐఎస్‌ఎఫ్‌లో చేరారన్నారు. విశాఖ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసి ఎర్రజెండాను చేత పెట్టారన్నారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పాత్ర గణనీయమైనదని పేర్కొన్నారు. 25 సంవత్సరాల పాటు భారత కమ్యూనిస్టు పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలందించడం ఆయన పట్టుదల సమన్వయానికి నిదర్శనం అన్నారు. తొలుత సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ కె సాబీర్ పాషా, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా దస్రు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమార్, ఎస్ కె. ఫహీమ్, నేరెళ్ల రమేష్, ధర్మరాజు, జహీర్, వుల్లోజు వెంకట్, లక్ష్మి, గుత్తుల శ్రీనివాస్, పల్నాటి వీణ రాణి, షమీమ్, మద్రి కృష్ణ, రసూల్, జలీల్, అంజయ్య నాయక్, మారుపాక అనిల్ కుమార్, శంకర్ నాయక్, చందు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

నకిలీ-జాతీయవాదమని కాంగ్రెస్ విమర్శించింది. ఏఐసీసీ సమావేశంలో భాగంగా 'న్యాయపథ్' తీర్మానాన్ని ఆమోదించింది. జాతీయవాదంపై దృష్టితో ఈ తీర్మానాన్ని చేసినట్లు వెల్లడించింది. ప్రాదేశిక సమగ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం... భారతీయుల సాధికారతకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. వెనుకబడిన, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన స్థాయి పురోగతి సాధించడమే నిజమైన జాతీయవాదమని వెల్లడించింది. రాజ్యాంగ విద్రోహ శక్తుల వినాశకార విధానాలు సాగనివ్వమని కాంగ్రెస్ సంకల్పించింది. ఒక దేశం, ఒకే ఎన్నిక వంటి ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచే ప్రతి చర్యను ప్రతిఘటిస్తామని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా సాధన,

ముస్లింల మత స్వేచ్ఛపై దాడి

విద్యా వ్యవస్థలో స్వాతంత్ర్యం, స్వేచ్ఛా ఆలోచన పద్ధతుల ఆచరణ, పారదర్శకంగా పునర్విభజన జరగడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉన్నట్లు తీర్మానం పేర్కొంది. నిర్మాణాత్మక సహకారం, సమ్మిళిత కసరత్తుల స్ఫూర్తితో ముందుకెళుతూ, ప్రజల సమస్యలపై పోరాడటానికి ఇండియా ఐక్య సంఘటనను ఏర్పాటు చేసుకున్నాం... భవిష్యత్‌లోనూ ఇదే పంథా అనుసరిస్తామని కాంగ్రెస్ స్పష్టంచేసింది.

గుజరాత్‌పై ప్రత్యేక తీర్మానం

గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఏఐసీసీ సందర్భంగా ప్రత్యేకంగా తీర్మానం జరిగింది. దీనిని పార్టీ గుజరాత్ అధికార ప్రతినిధి హీరేన్ బంకర్ ధ్రువీకరించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'గుజరాత్‌కు కాంగ్రెస్ ఎందుకు అవసరం' అనే శీర్షికతో జరిగిన ఈ తీర్మానంలో 30 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న తమ పార్టీ అధికారంలోకి రావడం కోసం అనుసరించే వ్యూహాలను పొందుపర్చాం. 'నూతన గుజరాత్, నూతన కాంగ్రెస్' నినాదంతో ముందుకెళుతున్నాం' అని తెలిపారు. 1960-70లో గుజరాత్ అభివృద్ధికి పునాది వేసింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. బీజేపీ పాలనలో గుజరాత్ అభివృద్ధి కుంటుపడినందునే ఏఐసీసీ ఇలా ప్రత్యేక తీర్మానం చేసిందని జైరాం రమేశ్ వెల్లడించారు.

గ్యాస్, పెట్రో ధరలు తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)

ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ నేతలు గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. పెట్రోల్ ,గ్యాస్ ధరల వలన పేదప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్ల పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం "మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్"గా మారిందని విమర్శించారు. పెట్రో రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. మోదీ చెప్పిన "అచ్ఛే దిన్" అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మధ్యతరగతి ప్రజలు సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా... సరుకులు కొనుక్కోవాలా అన్న మీమాంసలో ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ లేఖలో ప్రశ్నించారు.

వృద్ధ కార్మికురాలికి రూ.4 కోట్ల పన్ను నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

పన్ను చెల్లింపులు చేయకపోవడంతో అధికారులు మరోసారి నోటీసులు జారీ చేసి, రిటర్న్ దాఖలు చేయాలని సూచించారు. పన్ను ఎందుకు చెల్లించలేదో వివరణ ఇవ్వాలని ఆ లేఖలో కోరారు. పోస్టుమాన్ సాయంతో విషయం తెలుసుకున్న వృద్ధ దంపతులు కంగు తిన్నారు. ఆదాయపు పన్ను అంటే ఏమిటో కూడా తనకు తెలియదని వాపోయిందామె. ఈ ఘటనపై ఇన్‌కమ్ టాక్స్‌కు సంబంధించిన న్యాయవాది సంజయ్ జైన్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల నోటీసులు జారీ చేసే సమయంలో తప్పులు జరుగుతున్నాయన్నారు. ఆ కారణంగానే ఆమెకు ఈ నోటీసులు అంది ఉండవచ్చన్నారు. ఒకవేళ ఇది ఆధార్ ఫోర్జరీకి సంబంధించిన అంశం కూడా అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాధితురాలు సత్రా చట్టపరంగా ముందుకు వెళ్లాలని... నిర్ణీత గడువులోగా ఆ నోటీసులకు సమాధానం ఇవ్వాలని సూచించారు. వేతన కార్మికులకు ఇలా నోటీసులు జారీ చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో అలీగఢ్‌లోని ఒక కార్మికుడికి రూ.33.88 కోట్ల ఆదాయానికి సంబంధించి ఐటీ అధికారులు నోటీసులు పంపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లీనర్‌గా పని చేస్తున్న అతడికి నెలకు రూ.15 వేల జీతం మాత్రమే అందుతోంది. అలాంటి వ్యక్తికి ఐటీ అధికారులు నోటీసులు పంపడం గమనార్హం.

కేంద్ర మంత్రి మాంఝీ మనవరాలి హత్య

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం... బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సుష్మాదేవి భర్త రమేష్.. పని నుంచి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో నాటు తుపాకీ తీసుకొని కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. సుష్మా దేవి, రమేష్‌కు 14 ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. ఈ ఘటన సమయంలో వేరే గదిలో ఉన్న పూనమ్, సుష్మా పిల్లలు పరిగెత్తుకొని రాగా... అప్పటికే ఆమె రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాల్పుల్లో సుష్మాదేవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తన సోదరిని చంపినందుకు నిందితుడు రమేష్‌ను ఉరితీయాలని పూనమ్ డిమాండ్ చేశారు. మరోవైపు, ఇంట్లో తుపాకీ పేలుడు శబ్దం వినబడటంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఈ ఘటనపై ఎస్పీ ఎస్ఎస్‌పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నిందితుడిని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోరెన్సిక్ బృందం, సాంకేతిక నిపుణులను ఆధారాల సేకరణకు ఘటనా స్థలానికి పంపామని, తదుపరి దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

తేమ, తాలు లేకుండా చూడాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : తేమ, తాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, వెలిమినేడు, పెదకాపర్తి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అంతేకాక వెలిమినేడులో 22 లక్షల రూపాయల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొంత నిధులతో నిర్మించిన భవనాన్ని స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా 384 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్ని కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, టెంటు, కుర్చీలు వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో మొత్తం 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 45 దొడ్డు ధాన్యం కేంద్రాలు, 5 సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం సాధారణ ధాన్యం రకానికి ప్రకటించిన మద్దతు ధర 2300 రూపాయలు, గ్రేడ్ "ఏ" రకానికి క్వింటాలుకు 2,320 రూపాయల తో పాటు, సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్‌ను పొంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, హాజరయ్యారు.

గుత్తి కోయ గ్రామాలను సందర్శించిన చీఫ్ ఇంజనీర్

విశాలాంధ్ర - ములుగుజిల్లాబ్యూరో : పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, సీతక్క ఆదేశాల మేరకు బుధవారం ఆర్డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ హైదరాబాద్, పర్యవేక్షణ ఇంజనీర్ హన్మకొండ ఎస్ఈకె. మల్లేశం, ఎమ్ వెంకటసతీష్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏటూరునాగరం యం. సతీష్‌కుమార్, సంబంధిత ఏఈలు, ఏటూరునాగరము మండలంలోని గుత్తి కోయ గ్రామలు గంటలకుంట, గుండెంగవాయి, గ్రామాలను సందర్శించారు. త్రాగునీటి వనరులను పరిశీలించారు. ప్రజల వినతులను ఆలకించి, మంత్రి దృష్టికు, మీ సమస్యలు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి బి. రమాదేవి, గుత్తికోయ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతన్న కంట కన్నీరు

విశాలాంధ్ర - సత్తుపల్లి : అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడి అంతా గాలి దుమారానికి నేల పాలయింది. పంట చేతికి వచ్చింది కదా కోసి మార్కెట్‌కి తరలించి అప్పులు తీరుద్దామనుకుంటున్న సమయంలో సోమవారం సాయంత్రం వచ్చిన గాలి దుమారానికి టన్నుల కొద్దీ మామిడికాయలు రాలిపోయాయి. మండల పరిధిలోని రుద్రాక్ష పల్లి గ్రామానికి చెందిన ధరావత్ కృష్ణ అనే రైతు సుమారు 30 ఎకరాలు మామిడి తోటలను లీజుకు తీసుకొని అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. దిగుబడి బాగా రావటంతో తెచ్చిన అప్పులు పోను కొంత ఆదాయం మిగులుతుంది అనుకొని ఆశ పడుతున్న తరుణంలో ఈదురు గాలులతో కృష్ణ ఆశలు గల్లంతయ్యాయి. సుమారు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు మామిడికాయలు టన్నుల సంఖ్యలో నేలరాలాయి. ఈదురు గాలులతో వచ్చిన అకాల వర్షానికి నేలరాలిన మామిడికాయల విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని రైతు కృష్ణ వాపోతున్నాడు. వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించి, రైతులను ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంటర్, టెన్త్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : ఈ నెల 20 నుండి నిర్వహించనున్న ఇంటర్, పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి. అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో ఇంటర్ పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను, కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 3 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 712 మంది పరీక్ష రాస్తున్నారని తెలిపారు. 10వ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కోసం 3 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, 521 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి జి పాణిని, డిఎం అండ్ హెచ్ ఓ గోపాలరావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ మేళ : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : గత 15 రోజుల క్రితం ఏర్పాటు చేయబడిన స్పెషల్ టీమ్స్ ద్వారా - 332 సెల్ ఫోన్ లను మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన "మొబైల్ రికవరీ మేళ"లో ఆయన మాట్లాడుతూ సి ఇ ఐ ఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు నమోదు చేయబడిన 9878 దరఖాస్తులలో 2150 ఫోన్లను గుర్తించి, ఇదివరకే బాధితులకు అందించడం జరిగింది. ఇందులో గత 15 రోజుల క్రితం ఏర్పాటు చేయబడిన స్పెషల్ టీమ్స్ ద్వారా - 332 సెల్ ఫోన్ లను మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ వివరించారు. వాటిని "మొబైల్ రికవరీ మేళ" కార్యక్రమం ద్వారా బాధితులకు అందించడం జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. డిజిటల్ అరెస్ట్ అని, కస్టమ్స్ అధికారినని, వీడియొ కాల్స్ వస్తే నమ్మద్దని తెలిపారు.

అమరవీరుల త్యాగాలే మనకు స్ఫూర్తి కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హేమంతరావు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కార్మిక వర్గాలు, పేద ప్రజలకోసం తమ జీవితాలను అంకితం చేసి పోరాడిన గత తరం అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ వారి ఆశయాల సాధన కోసం నేటితరం కమ్యూనిస్టులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలం సింగరేణి కార్మిక ప్రాంతం రుద్రంపూర్ సెంటర్లో పునర్నిర్మించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యులు, స్వాతంత్ర్య, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు దేవూరి శేషగిరిరావు విగ్రహాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షులు బందెల నర్సయ్య విగ్రహాన్ని కూడా వారు ఆవిష్కరించారు. తొలుత అమర నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నాయకులతోపాటు పార్టీ శ్రేణులు నివాళు లిర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ సింగరేణి ప్రధాన కార్యాలయంలో సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన శేషగిరిరావు నాటి బ్రిటీష్ తెల్లదొరల, కార్మికుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేసారు. బొగ్గుగనుల్లో మహిళలు, పిల్లలతో పనిచేయించే విధాన్ని వ్యతిరేకించిన తొలితరం ఉద్యమకారుడు శేషగిరిరావు అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు ఆకర్షితులైన రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన బందెల నర్సయ్య సీపీఐ, ఏఐటీయూసీలో రాష్ట్ర స్థాయికి ఎదిగారన్నారు. ఇలాంటి నేతను కొత్తగూడెం ప్రాంతం కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాల సాధనకు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వాసిరెడ్డి మురళి, గనిగళ్ళ వీరస్వామి, తోట రాజు అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, తాటి వెంకటేశ్వర్లు, డీ వెంకన్న, సరెడ్డి పుల్లా రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ రావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, జిల్లా సమితి సభ్యులు ధమాలపాటి శేషయ్య, వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, కంచర్ల జమలయ్య, రమణ మూర్తి, భూక్యా శ్రీను, భూక్యా దస్రు, పోలుమూరి శ్రీనివాస్, లక్ష్మీపత్తి, జక్కుల రాములు, కుమారి హనుమత్ రావు, బరిగల సంపూర్ణ, ఫహీమ్, రత్న కుమారి, మునిగడపు వెంకటేశ్వర్లు, రామచందర్, వెంకట రమణ, మద్దెల శివకుమార్, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు, అభిమానులు, బందెల నరసయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర - కొమురం భీం : జిల్లా కేంద్రంలోని ఈ.వి.ఎం. గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కొరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం నెలవారి తనిఖీలు భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదాము, రక్షణ చర్యలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్టమైన బందోబస్తు, సి.సి. కెమెరాల ద్వారా 24 గంటలపాటు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సునీల్, నాయక్ తహసిల్దార్ శ్యామ్ లాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకోవాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్ : మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న అన్నారు. బుధవారం పట్టు పరిశ్రమ శాఖ ఉప సంచాలకులు ముత్యాలరావు అధ్యక్షతన కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, తొర్రూరు, డోర్నకల్, తదితర మండలాల్లో మల్బరీ సాగు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలకు ప్రత్యామ్నాయంగా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేయాలని రైతులకు తెలిపారు. మల్బరీ సాగు చేస్తూ రైతులకు 2 ఎకరాలకు 3 లక్షలు రూపాయల నికర ఆదాయం పొందుతున్నారన్నారు. మల్బరీ సాగుకు మొక్కలపై, పట్టు పురుగుల పెంపకం షెడ్ నిర్మాణంకు, స్టాండులు, మెటీరియల్ మొదలైన వాటికి 4 లక్షల వరకు రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపినారు. మొక్క నాటిన నుండి పట్టుగూళ్ళు మార్కెటింగ్ వరకు రైతులు పాటించవలసిన పలు మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు తెలిపారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న, ఖమ్మం, మహబూబాద్ జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సురేష్, బి.వెంకన్న, రాజయ్య, పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలంలోని గుండెంగా పరిధిలోనే ఉన్న గన్య చక్ర తండా గ్రామపంచాయతీ పరిధిలోనీ నల్లబోడు తండలో కరెంటు షార్ట్ సర్క్యూట్ అయి మొక్కజొన్న దగ్ధమైంది. నల్లబోడు తండా వాసి బాదావత్ నంద మాట్లాడుతూ నాలుగు ఎకరాల మొక్కజొన్న వేశానని, చేతికి అంది వచ్చిన పంట కరెంటు షాక్ గురై మొత్తం కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాదావత్ నంద తెలిపారు. కాలిపోయిన పంటను పరిశీలించిన ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ మాట్లాడు తూ పంటలు పండించడంలో ఎన్ని జాగ్రత్తలు వహించి చేతికి వచ్చేవరకు కూడా రైతులు అన్ని జాగ్రత్తలు పాటించాలని కరెంటుతో జాగ్రత్తలు తీసుకోవా లని ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ కోరారు.వెంటనే కరెంట్ డిపార్ట్మెంట్ డిఈతో మాట్లాడి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరివారం అందించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోజి నాయక్, మంగీలాల్, ఫుల్ సింగ్, ఈర్య, సంకీర్యలు పాల్గొన్నారు.

ఏటూరు నాగారంలో 50 పడకల ఆసుపత్రి

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : ఏటూరునాగారంలో 30 పడకల ఆసుపత్రిని, 50 పడకల ఆసుపత్రిగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మంత్రి సీతక్కకు, ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఏటూరూనాగారం మండల కమిటి హర్షం వ్యక్తం చేశారు. రఘు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య శాఖ మంత్రి దామోదర రాజనం సింహకు మంత్రి సీతక్కకు,ప్రజల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్,జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, మండల టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు గద్దల నవీన్ పాల్గొన్నారు.

ఆడపిల్లను కన్న దంపతులకు సత్కారం

విశాలాంధ్ర - కారేపల్లి : ఆడపిల్లను కన్న దంపతులను మండల అధికారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి జిల్లా కలెక్టర్ ద్వారా పంపిన సర్టిఫికెట్ను అందజేశారు. బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమం క్రింద సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామంలో జి స్రవంతి, ఉపేందర్ దంపతుల ఇంటికి వెళ్లి మహాలక్ష్మి పుట్టినందుకు గాను వారిని అబినందించి శాలువాతో సత్కరించి మిఠాయిలు పంపిణీ చేసి కలెక్టర్ ద్వారా ఇచ్చినటువంటి సర్టిఫికెట్‌ను మండల ప్రత్యేక అధికారి కే నవీన్ బాబు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఆడపిల్లలను చిన్న చూపు చూడకుండా ఆడ పిల్లలకు ప్రభుత్వ కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు వినియోగించుకొని పెద్ద చదువులు చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని అలాంటి ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండల అభివృద్ధి అధికారి జి.సురేందర్ పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల బజరంగ్‌దళ్ యాత్ర ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలో భజరంగ్ దల్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్రను ప్రారంభించారు. భక్తుల యాత్రకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రలో భాగమై హనుమంతుని భక్తితో నియమ నిష్ఠలతో కొలిచి ఆశీస్సులు పొందడం సంతోషంగా ఉందని ఆ హనుమంతుని దీవెనలతో ప్రజలంతా పాడిపంటలతో సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

విశాలాంధ్ర - తొర్రూరు: దళారుల చేతులు రైతులు మోసపోవద్దని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో గోనెసంచి టార్పాలిన్లను అందుబాటు లో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు. ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 అందిస్తుందని తెలిపారు. రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు పాపిరెడ్డి, టీకు నాయక్, వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, మహిళ మండల నాయకురాలు మాలోత్ సునీత రాజేందర్, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు అంతిమ వీడ్కోలు

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం నగరం ఎరుపుమయమైంది. సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహాసభలకు ప్రతినిధిగా హాజరై ఆకస్మికంగా మృతి చెందిన యర్రా శ్రీకాంత్‌కు బుధవారం అంతిమ వీడ్కోలు పలికారు. పార్టీ శ్రేణులు సైతం భారీగా కదలివచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరయ్యారు. శ్రీకాంత్ భౌతికకాయంపై సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో శ్రీకాంత్ పాడెను అరుణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు మోశారు. శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ నివాసగృహం నుంచి మొదలైన అంతిమయాత్ర త్రీటౌన్ వ్యాప్తంగా తిరిగి కాల్వొడ్డులోని వైకుంఠ ధామంలో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. దీనికి ముందు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాంత్ స్వగృహం అక్షయ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన సంతాప సభలో నేతలు మాట్లాడారు. పార్టీ కేంద్ర కమిటీ తరఫున నివాళి అర్పిస్తున్నట్లు ప్రకటించారు. సీపీఐ (ఎం) అంటేనే 'యర్రా' కుటుంబం.. 'యర్రా' కుటుంబం అంటేనే సీపీఐ (ఎం) అనే రీతిలో ఆ కుటుంబం పార్టీతో పెనవేసుకుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. శ్రీకాంత్‌తో తనకున్న జ్ఞాపకాలు మర్చిపోలేనివని సీపీఐ(ఎం) కేంద్ర కమిటిసభ్యులు సాయిబాబు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. యర్రా కుటుంబం వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్ళ డమే మన కర్తవ్యమని సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ కమిట్‌మెంట్ ఉన్న కమ్యూనిస్టు నాయకుడు యర్రా శ్రీకాంత్ అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళి అర్పించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, ప్రభాకర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.జె.రమేష్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బండి పద్మ, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్కే జమాల్ , మాదాపూర్ డీఎస్పీ, శ్రీకాంత్ చిన్ననాటి మిత్రుడు పద్మనాభుల శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి మెంతుల శ్రీశైలం, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ హన్మంతరావు, తల్లాడ రమేష్, ఆత్మ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ సీనియర్ నాయకులు పి.సోమయ్య, బుగ్గవీటి సరళ, పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - గార్ల : కమ్యూనిస్టు యోధుడు, విలువలకు మారు పేరైనా సిపిఐ జాతీయ నాయకులు, అమరజీవి చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకై పార్టీ శ్రేణులు కృషి చేయాలనీ సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో విప్లవ సేనాని చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో జన్మించిన చంద్ర పేదలు, అణగారిన వర్గాల కోసం ఎర్రజెండా చేబూని తన యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. భూపోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ముద్దుబిడ్డగా పేరు గడించారని గుర్తు చేసుకున్నారు. దోపిడి, పీడనకు గురవుతున్న ప్రజలకు అండగా నిలిచారన్నారు. తన తుది శ్వాస వరకు నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అమలు జరిపిన చంద్ర ఆశయ సాధనకై నేటితరం కమ్యూనిస్టు నాయకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, దుపాటి జనార్దన్, మాగం లోకేష్, భీమ్లా, రంగయ్య, సుధాకర్, దాదేమియా, శ్రీనివాస్, హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులకు ప్రత్యేకంగా బడ్జెట్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో పడిందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొ రేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి దొడ్డి దారిన అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే దేశంలోని అన్ని రంగాలు మీద నష్టాలప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వాలు గమనించి స్వామినాథన్ సిఫార్సులు తక్షణమే అమలు చేసి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. పంటలకు మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే తప్ప వ్యవసాయంలో రైతు నిలబడలేరని పేర్కొన్నారు. మిర్చి కింటాకు 25 వేలు, పత్తికి రూ. 16 వేలు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. గతంలో వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకునేవారన్నారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, నారాటి రమేష్, నపవట్ రవి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, సీతారాం రెడ్డి, కుమారి హనుమంతరావు, వైఎస్ గిరి, రామచందర్, భూక్య దసురు, వెంకటేశ్వర్లు, ఇమ్మానుయేల్, లక్ష్మీపతి, గోవింద్, నాగేశ్వరరావు, ఎండి యూసుఫ్ పాల్గొన్నారు.

జేవిఆర్ ఓసి, సిహెచ్‌పి తనిఖీ చేసిన డైరెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలోని జేవిఆర్ ఓపెన్ కాస్ట్, జేవిఆర్ సిహెచ్‌పిని డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు బుధవారం తనిఖీ చేసారు. ఇక్కడ బొగ్గు ఉత్పత్తి, రవాణా తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద డంపర్స్ నుండి బొగ్గు అన్లోడింగ్ చేస్తున్నప్పుడు దుమ్ము, ధూళి లేవకుండా బొగ్గు డంపర్స్‌లో నింపుతున్నప్పుడే తడపాలని సూచించారు. తద్వారా అన్లోడ్ చేస్తున్నప్పుడు దుమ్ము ధూళి లేవకుండా కార్మికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రైమరీ కోల్ క్రషర్ ఏరియాను కూడా డైరెక్టర్ తనిఖీ చేశారు. సిహెచ్‌పిలోని డిశ్చార్జ్ పాయింట్లను, సైలో బంకర్‌ను తనిఖీ చేసి అక్కడ నుండి దుమ్ము ధూళినీ రాకుండా ఎలా అరికట్టాలో సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. జిఎంలు సూర్యనారాయణ, తిరుమలరావు, ఎస్ఓ టు డైరెక్టర్ కె.వి.రావు, ఎస్ఓటు జిఎం జీవి కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, సి.హెచ్.పి ఇంచార్జ్ సోమశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, మేనేజర్ రాజేశ్వరరావు, డీజీఎంలు శ్రీకాంత్, హరి నారాయణ, ఎస్ఈ కేశవరావు, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌కు గడువు పెంపు

విశాలాంధ్ర - కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 15 వరకు పొడిగించడం జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌కు ఎన్నికైన యువకులకు స్టైఫండ్ కింద ముందుగా రూ. 6వేలు అనంతరం ప్రతి నెల రూ.5 వేల చొప్పున కేంద్రం ప్రభుత్వం అందిస్తుందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీచదివిన వారికి అవకాశం కలగనుందన్నారు. 21 నుండి 24 ఏండ్ల మధ్య వయస్సు కలిగి సంవత్సర ఆదాయం రూ.8 లక్షలు లోపు ఉన్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ దశలో 5,357 మందికి ఇంటర్న్ షిప్ కు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువకులు తమ ఆధార్ కార్డ్ లింక్ అయి ఉన్న ఫోన్ నంబరుతో ఈనెల 15 లోపు తమ వివరాలు pminternship.mca.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత కంటి పరీక్షల శిబిరం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారి రెహమాన్ సారథ్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబాలకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డిఎస్పి రెహమాన్ తెలిపారు. ప్రతి మనిషికి శరీరంలోని అన్ని అవయవాలలో కళ్ళు చాలా ప్రధానమైనవన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కంటిచూపును ఎప్పటికప్పుడు సరిగా కాపాడుకోగలిగితేనే మన దైనందిన జీవితం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఇంద్రాసేనారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సుంకాల వేలం పాట

యాభై ఆరు అంగుళాల వెడల్పు ఛాతీ ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిజంగా అపారమైన గుండె దిటవు ఉన్న వ్యక్తే. రెండో సారి అమెరికా అధ్యక్షుడైన తరవాత డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్నంతటినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. తన ప్రమాణ స్వీకారోత్సవానికి భారత ప్రధానిని ఆహ్వానించకపోగా భారత్ అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల మీద అడ్డదిడ్డంగా సుంకాలు విధిస్తోందని నానా యాగీ చేశారు. భారత్ మీద భారీగా సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. అక్కడితో ఆగకుండా అనేక దేశాల మీద సుంకాలు విధించారు. భారత్‌కు చెందిన ఔషధ కంపెనీలను మాత్రం అదనపు సుంకాలు విధించడం నుంచి మినహాయించారు. దీనితో మన దేశంలోని ఈ రంగం ఇప్పటికైతే ఊపిరి పీల్చుకుంది. ట్రంప్ విధిస్తున్న అస్తవ్యస్త సుంకాలకు భారత్ మినహా అనేక దేశాలు అమెరికా మీద సుంకాలు విధించి యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల మీద చైనా 84 శాతం సుంకాలు విధిస్తే ట్రంప్ వెంటనే చైనా మీద 104 శాతం సుంకాలు విధించారు. చైనా విధించిన సుంకాలు గురువారం నుంచి అమలులోకి వస్తాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే సరుకుల మీద చైనా ఇప్పటిదాకా 34 శాతం సుంకం విధుస్తూ ఉండేది. ట్రంప్‌తో సుంకాల యుద్ధంలో చైనా ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. చైనా ప్రతీకార సుంకాలు విధించినందువల్ల అమెరికా కంపెనీలు చైనా నుంచి తక్షణం అమెరికాకు వచ్చేయాలని ట్రంప్ ఆదేశించారు. ఒక దేశం నుంచి కంపెనీలను ఏక మొత్తంగా ఉపసంహరించడం అంటే అదేదో పిల్లలాట అని ట్రంప్ భావిస్తున్నట్టున్నారు. మరో వేపు యూరప్ సమాజం కూడా వచ్చే పదిహేనో తేదీ నుంచి అమెరికా మీద అదనపు సుంకాలు విధించనున్నట్టు ప్రకటించింది. మే, డిసెంబర్ మాసాల్లో ఈ సుంకాలు మరింత పెరగొచ్చు. సుంకాల వివాదంవల్ల వివిధ దేశాల్లో మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. స్టాక్ మార్కెట్లు కుదేలై పోతున్నాయి. దీర్ఘ కాలిక అమెరికా ప్రభుత్వ బాండ్లను కూడా జనం తెగనమ్మేస్తున్నారు. ఇంత కాలం అవి చాలా భద్రమైనవి అనుకునే వారు. తాను ఎడాపెడా సుంకాలు విధిస్తున్నందు వల్ల చైనాతో సహా అన్ని దేశాలు తనతో కాళ్ల బేరానికి వస్తున్నట్టు ట్రంప్ చెప్తున్నారు. ఆ దేశాల స్పందన కోసం ఎదురు చూస్తున్నాం. ఆ దేశాలు దిగి రావడం తప్పదు అని ట్రంప్ అంటున్నారు. ట్రంప్ ఎంత దూకుడుగా ప్రవర్తిస్తున్నా ఆయన నిర్ణయాలు అమెరికా మార్కెట్లను కూడా ప్రభావితం చేస్తున్నాయి. యూరప్ మార్కెట్ల పరిస్థితి అయితే ఘోరంగా దిగజారుతోంది. యూరప్ సమాజం మూడు విడతలుగా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించనుంది. ఇందులో మొదటి విడత సుంకాల విధింపు మంగళవారమే మొదలైంది. మే 15న రెండవ విడత, డిసెంబర్ ఒకటిన మూడవ విడత సుంకాలు విధించే అవకాశం ఉంది. యూరప్ దేశాల మీద ట్రంప్ మార్చిలోనే 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. యూరప్ దేశాలు వెంటనే స్పందించక పోవడానికి 27 దేశాలు కలిసి సమష్టి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. అయితే ట్రంప్ దిగివచ్చి సంప్రదింపులకు అంగీకరిస్తే యూరప్ దేశాలు వెనక్కు తగ్గే అవకాశం కూడా ఉంది.

ట్రంప్ దూకుడును నిలవరించడానికి భారత్ కూడా కొన్ని చర్యలు తీసుకోవచ్చునన్న ఊహాగానాలు సాగుతున్నాయి కానీ నికరమైన చర్యలేవీ ఇప్పటిదాకా కనిపించలేదు. ట్రంప్ దూకుడు ప్రభావం భారత మార్కెట్ల మీద ప్రస్ఫుటంగానే కనిపిస్తోంది. భారత స్టాక్ మార్కెట్ అడ్డూ ఆపు లేకుండా పతనం అవుతోంది. మంగళవారం కాస్త పుంజుకున్నట్టు కనిపించినా పతనమయ్యే ధోరణి మాత్రం అలాగే మిగిలి ఉంది. లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరై పోతోంది. ట్రంప్ ఆగడంవల్ల ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందన్న భయం పీడిస్తోంది. మార్కెట్లో పెట్టుబడి పెట్టే వారిలో తీవ్రమైన అభద్రతా భావం కనిపిస్తోంది. దీనివల్ల స్టాక్ మార్కెట్లలో అపూర్వమైన రీతిలో అమ్మకాలు కొనసాగుతున్నాయి. కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే మదుపర్ల సంపద ఏకంగా రూ.20 లక్షల కోట్ల మేర ఆవిరైంది. సోమవారం ఆసియా మార్కెట్లు భారీగా నష్టాలు నమోదు చేయగా... తర్వాత ఐరోపా మార్కెట్లు కూడా అదే బాటలో పయనించాయి. ఇదే కోవలో భారత స్టాక్‌మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్లో దాదాపు 559 షేర్లు పురోగమించగా 3,372 షేర్లు కుప్పకూలాయి. ప్రపంచ మార్కెట్ల ప్రభావానికి పెద్దగా గురికాని చైనా మార్కెట్లకూ నష్టాల సెగ తప్పలేదు. కార్పొరేట్ సంస్థల లాభాలు తగ్గొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది వినియోగదారుల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ఫలితంగా ఆర్థికాభివృద్ధి మందగించే అవకాశాలున్నాయి. దిగజారుతున్న ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రిజర్వు బ్యాంకు రెపో రేట్ 6 శాతానికి తగ్గించింది. గృహ నిర్మాణానికి, సొంత వినియోగానికి తీసుకునే రుణాల మీద వడ్డీ రేట్లు తగ్గించాలని రిజర్వు బ్యాంకు భావిస్తోంది. ఇంకో వేపు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గత నాలుగేళ్లలో ఎన్నడూ లేనంతగా తగ్గాయి. వైపరీత్యం ఏమిటంటే మోదీ ప్రభుత్వం మాత్రం మునుపటి అలవాటు ప్రకారం అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధర తగ్గినప్పటికీ పెట్రోల్, డీజెల్ ధరలు లీటర్‌కు రెండు రూపాయలు, వంట గ్యాస్ ధర యాభై రూపాయలు పెంచేసింది. ఔషధ కంపెనీల మీద ట్రంప్ కొత్తగా సుంకాలు విధించనప్పటికీ వాటి షేర్ల ధరలు కూడా 1.7 శాతం పడిపోయాయి. మన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుతం లండన్‌లో పర్యటిస్తున్నారు. మన ఆర్థిక వ్యవస్థలో లాఘవం బాగా ఉందని, దేశంలో గిరాకీ బాగా ఉన్నందువల్ల మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి నష్టం ఏమీ లేదని చెప్తున్నారు. ఎలాంటి పరిస్థితి వచ్చినా భారత్ ఎదుర్కోగలదన్న ధీమా నిర్మలా సీతారామన్ మాటల్లో వ్యక్తం అయింది. ట్రంప్ ఆగడాన్ని ఎలా ఎదుర్కుంటారో ప్రధానమంత్రి మోదీ ఇప్పటిదాకా నోరు తెరచి చెప్పలేదు. అయితే అమెరికాకు మరిన్ని ఆపిల్ ఫోన్లు పంపిస్తారట. చైనా సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందువల్ల ఈ అనుమతులు మనకు అనుకూలంగా ఉంటాయని అంటున్నారు. అయినా ఇవి తాత్కాలిక చర్యలుగానే మిగిలి పోవచ్చు. ఆపిల్ సంస్థ ఫోన్లు తయారు చేయడానికి ఐ ఫోన్ విడిభాగాల కోసం చైనా మీద ఎక్కువగా ఆధారపడ్తుంది.

మాటలకు, చేతలకు పొంతన లేని మోదీ!

నిత్యచక్రవర్తి

ఇండియాకు పొరుగున ఉన్న దేశంలో 2025 లో ముందుగా పర్యటిస్తానని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ ఆ పని ఎందుకు చేయలేకపోయారు? ఆకర్షణీయమైన నినాదాలు చేయడంలో మోదీ నిపుణుడు. ఆ నినాదం జరగొచ్చు, జరగకపోవచ్చు. దక్షిణాసియాలో పొరుగు దేశంతో ముందుగా కలుస్తానన్నారు. అంతేకాదు ఆగ్నేయాసియా దేశాలలోను, ఆసియా దేశాలలోను ముందుగా పర్యటిస్తానని చెప్పిన మోదీ తూర్పు దేశాలలో పర్యటించారు. బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టి సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో ఆపరేషన్) శిఖరాగ్ర సమావేశం జరిగింది. బిమ్‌స్టెక్ బ్రహ్మాండమైన వృద్ధిని సాధిస్తుందని మోదీ మాట్లాడారు. దక్షిణాదికి, పశ్చిమాసియాకు మధ్య కీలకమైన అంతరం ఉందని అన్నారు. బిమ్‌స్టెక్ సమావేశంలో ఆయన 21 పాయింట్లతో కార్యాచరణ ప్రణాళికను ప్రవేశపెట్టారు. మరొక ప్రాంతీయ సంస్థ సార్క్‌ను మొదట ప్రోత్సహించారు. అయితే ఇప్పుడు ఇండియా ఎస్‌సీవో, బ్రిక్స్ సంస్థలతో మోదీ సహకరించడం లేదు. బిమ్‌స్టెక్ నూతన చైర్మన్‌గా బంగ్లాదేశ్ బాధ్యతలను స్వీకరించింది. ప్రస్తుతం ఉన్న సూచనల ప్రకారం బంగ్లాదేశ్ జాతీయ ఎన్నికలు 2026 మధ్యలో జరగవచ్చు. తదుపరి బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశం ఢాకాలో జరుగుతుంది. ఈ సమావేశానికి బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు డాక్టర్ మహ్మద్ యూనస్ అధ్యక్షత వహించే అవకాశం ఎంతైనా ఉంది.

బిమ్‌స్టెక్ సమావేశం ముగిసిన తరువాత బ్యాంకాక్‌లో ఏప్రిల్ 4 న డాక్టర్ యూనస్‌తో మొదటి ద్వైపాక్షిక సమావేశానికి మోదీ హాజరయి చర్చలు జరిపారు. ఈ సమావేశం జరిగే వరకు భారతదేశం వైపు నుంచి సమావేశం జరిగేది లేనిది ధృవీకరణ లేదు. బ్యాంకాక్‌లో మొదటి ద్వైపాక్షిక సమావేశం జరగవచ్చునన్న సూచనలు మాత్రమే ఉన్నాయని బంగ్లాదేశ్ అధికారులు తెలిపారు. అయితే పూర్తి దౌత్యపరమైన నియమాలతో సమావేశం జరగవలసి ఉందని బంగ్లాదేశ్ అధికారులు అన్నారు. దౌత్య పరమైన నియమాలతో సమావేశం జరిగి ఉంటే భారతదేశానికి కొంచెం మంచి ఫలితాలు వచ్చేవి. డాక్టర్ యూనస్‌తో మన ప్రధాని మోదీ సమావేశం కావడం జాప్యం అయింది. అందుకు మోదీనే కారకుడు. అయితే మార్చి 26 నుంచి 29 వరకు జరిగిన పర్యటనలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో డాక్టర్ యూనస్ సమావేశం అయ్యారు. ముందుగా ఢిల్లీలో పర్యటించాలని అనుకున్న యూనస్ విదేశీ పర్యటనలో మొదటిసారి చైనాలో పర్యటించి జిన్‌పింగ్‌ను కలుసుకోవటం వలన అనంతరం మోదీతో మంచి స్థాయి నుంచి సమావేశం కాగలిగారు. ఈ సమావేశాని కంటే ముందు మన సౌత్ బ్లాక్ నేత మోదీ సక్రమంగా స్పందించ లేకపోయారు. బంగ్లాదేశ్‌లో 17 కోట్ల మంది ప్రజలుండగా వీరిలో ఎనిమిది శాతం హిందువులు ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తరువాత ఆమె తప్పించుకుని ఇండియాకు చేరుకున్నారు. అనంతరం మైనారిటీల పైన (హిందువులు) దాడులు జరిగాయి. యూనస్ ప్రభుత్వం తగిన భద్రతా చర్యలను తీసుకుని మైనారిటీలను రక్షించాలని భారత ప్రభుత్వం క్రమం తప్పకుండా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నది. బంగ్లాదేశ్‌లో హిందువులు, బౌద్ధులు, క్రిస్టియన్లు కలిసి ఆ దేశ ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రమంగా అక్కడ పరిస్థితి ప్రభుత్వ నియంత్రణలో ఉంది. తీవ్రవాదులు, మత ఛాందసవాదులపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఇండియా ప్రభుత్వం గట్టిగా కోరుతున్నది. డాక్టర్ యూనస్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా బాధ్యతలు తీసుకొని ఎనిమిది నెలలకు పైగా గడిచింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సహకారం కొనసాగించేందుకు సమగ్ర కార్యక్రమాన్ని ఇండియా రూపొందించ లేకపోయింది. హసీనాను తమ దేశానికి పంపాలని డిమాండ్ చేయడంతో పాటు అనేక రాజకీయ సమస్యలు ఉన్నాయి. ఈ అంశం రెండు దేశాలకు తెలుసు. కొన్ని సమస్యలపైన తక్షణం దృష్టి పెట్టాలి.

ఈ విషయంలో ఇండియా సహకరించగలదు. ప్రధాన మంత్రి మోదీ ముందుగా డాక్టర్ యూనస్‌ను కలుసుకుని ఉంటే ఆయన చైనాలో పర్యటించి ఆర్థిక సహకారంతో పాటు ఇతర అంశాలలో చైనా సహకారాన్ని పొందగలిగేవారు కాదు. బంగ్లాదేశ్ అధికారులతో ఇండియా దూరంగా ఉంది. చైనా, పాకిస్తాన్‌లతో బంగ్లాదేశ్ మరింత సానుకూలమైన పంథాని ఏర్పర్చుకునే అవకాశం బంగ్లాదేశ్‌కు ఉంది. బంగ్లాదేశ్‌లో ప్రజలతో ఇప్పటికే సరైన సంబంధాలు లేక ఇండియా ప్రతిష్ట ముందుముందు మరింత తగ్గిపోతుంది. షేక్ హసీనా విషయంలో ఇండియా ఏం చేయనున్నదని అంశం స్పష్టంగా లేదు. హసీనా బంగ్లాలోని తన మద్దతుదారులతో ఇండియా నుంచి వీడియో ద్వారా మాట్లాడుతూనే ఉన్నారు. బ్యాంకాక్‌లో మోదీ, యూనస్‌లు సమావేశమైనప్పుడు హసీనా కార్యకలాపాలపై ప్రధానంగా చర్చించారు. హసీనాను ఇండియాలోనే ఉంచినట్లయితే బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై దుష్ట ప్రచారాన్ని చేసే అవకాశం ఉందని అందువల్ల ఆమెను ఇండియాలోనే అట్టిపెట్టరాదని యూనస్ కోరుతున్నారు. తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తానని అత్యాచారాలకు పాల్పడిన వారి విషయం ఇప్పుడున్న అవామీలీగ్ మద్దతుదారులతో మాట్లాడతానని ఆ పార్టీ అవామీలీగ్‌కు హసీనా చెప్పారు. మోదీ యూనస్‌తో మాట్లాడినప్పుడు బంగ్లాదేశ్ ప్రజలతోను, ప్రభుత్వంతోను మాత్రమే సంబంధాలు పెట్టుకుంటామని అక్కడి ఏ రాజకీయ పార్టీ నాయకుడితోను లేదా పార్టీతోను సంబంధాలు పెట్టుకోబోమని యూనస్‌కి హామీ ఇచ్చారు. ఈ హామీ బంగ్లాదేశ్ ప్రజల మనసులను సానుకూలంగా మార్చవచ్చు. అయితే హసీనా ఇంకా ఇండియాలోనే ఉన్నందున ఇది ఎంతవరకు సాధ్యమో తెలియదు. మోదీ ప్రభుత్వానికి ఇదొక పెద్ద ప్రశ్నార్థకం. హసీనాను బంగ్లాదేశ్‌కి పంపించాలని యూనస్ చేసిన దౌత్యం విజయవంతం అయ్యింది. హసీనాకు సంబంధించి బంగ్లాదేశ్ ప్రభుత్వం వైఖరిని మానవ హక్కుల సంస్థలు సమర్థిస్తున్నాయి.

గోదావరి ట్రిబ్యునల్ ఎందుకు కోరడం లేదు?



వి.శంకరయ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నాటి నుంచి కృష్ణ నదీ జలాల వివాదం తెలంగాణ అవశేష ఆంధ్ర ప్రదేశ్ మధ్య రావణ కాష్టంలాగా రగులుతోంది. కేసీఆర్ తో జగన్‌మోహన్ రెడ్డి సాగించిన చెలిమి అంతిమంగా కొత్తగా ట్రిబ్యునల్ నియామకానికి దారి తీసింది. నదీ జలాల పంపిణీ అంశంపై రాష్ట్ర విభజన చట్టంలో అనువైన సెక్షన్‌లు వున్నా 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం సెక్షన్ 3 కింద కొత్త ట్రిబ్యునల్ నియామకానికి కేసీఆర్ పన్నిన కుట్రలో జగన్‌మోహన్ రెడ్డి చిక్కుకొని 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో డీసెంట్ నోట్ పెట్టక పోవడంతో కొత్త ట్రిబ్యునల్ నియామకం జరిగి అవశేష ఆంధ్రప్రదేశ్‌కు గుండెలు మీద కుంపటిలాగా తయారైంది. ఇప్పుడు గోదావరి జలాల వివాదం కూడా పీటముడిపడి నానాటికీ బిగుసుకొంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టుదలగా చేపడుతున్న గోదావరి బనకచర్ల అనుసంధానం పథకంపై తాము సుప్రీంకోర్టును ఆశ్రయించదలచినట్లు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రకటించారు, రెండు రోజులు క్రితం నీటి పారుదల ఉన్నత స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఎంతో కొంత సామరస్యంగా పరిష్కారమౌతాయని భావించిన వారికి ఆశాభంగమే మిగిలింది. ఈ అస్తవ్యస్త పరిస్థితి అంతిమంగా నిత్య కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమకు శరాఘాతంగా మిగిలి పోతోంది.

కృష్ణా నదీ జలాల వివాదం లాగే ఉభయ రాష్ట్రాల మధ్య గోదావరి జలాల వాటా కూడా పదేళ్లు గడచినా తేల లేదు. గమనార్హమైన అంశమేమంటే కృష్ణానదిలో ఎప్పుడో గాని వరద జలాలు వుండవు. గోదావరి నదిలో ఆలా కాదు. ప్రతి ఏటా వందలాది టీఎంసీల నీళ్లు సముద్రం పాలైతున్నాయి. ఈ ఏడు గరిష్టంగా 4136.96 టీఎంసీల నీళ్లు సముద్రం పాలైనవి. అయినా రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడుతున్నదంటే పక్క పక్క రాష్ట్రాల మధ్య వుండ వలసిన సామరస్యం కొరవడటమే కాకుండా ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాలకు పొగ బట్టడం కూడా కారణంగా వుంది. గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 1486.85 టీఎంసీలను కేటాయించినది. ఏటా సముద్రంలో ఇంతకు రెండింతలు టీఎంసీల నీళ్లు సముద్రం చేరుతోంది. కాని రెండు రాష్ట్రాల మధ్య జగడం తప్పడం లేదు. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 నికర జలాల్లో తమ వాటా 957.85 టీఎంసీలని ఆంధ్ర ప్రదేశ్ వాటా 518.85 టీఎంసీలని తెలంగాణ విభజన నాటి నుంచి చెబుతోంది. ఆంధ్ర ప్రదేశ్ ఇందుకు భిన్నంగా తమ వాటా 7 78 టీఎంసీలని, తెలంగాణ వాటా 658 టీఎంసీలని వాదిస్తోంది. సహజంగా రాష్ట్రాల మధ్య జుట్లు పందేలు పెట్టే కేంద్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా కృష్ణానది జలాల వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్ నియమించింది. గాని గోదావరి నదీ జలాల పంపిణీ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుంది.

కృష్ణా గోదావరి నదీజలాల వాటాలు తేల్చేందుకు ఒకే రోజు ట్రిబ్యునల్స్ వేయాలని 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్బిద్ధితో 2023 ఎన్నికల్లో తెలంగాణలో లబ్ధి పొందేందుకు నాలుగేళ్లుగా దస్త్రాలకే పరిమితమైన కృష్ణానదీ జలాల వివాద ట్రిబ్యునల్ ప్రతి పాదన దుమ్ము దులిపి ట్రిబ్యునల్ వేసి ఆంధ్ర ప్రదేశ్ ప్రజల గొంతుకోసింది. తదనంతరం మూడేళ్ల కాలం అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ఏ నాడూ కేంద్ర ప్రభుత్వాన్ని గోదావరి ట్రిబ్యునల్ వేయమని అడిగిన పాపాన పోలేదు. కృష్ణానదిపై ట్రిబ్యునల్ నియామకం కోరి సాధించుకున్న తెలంగాణ అప్పుడూ ఇప్పుడూ గోదావరి ట్రిబ్యునల్ నియామకానికి మోకాలడ్డుతోంది. పోనీ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన దాఖలా లేదు. ఆ మాట కొస్తే అంతర్ రాష్ట్ర జల వివాదాలపై ముఖ్యమంత్రి అంతగా దృష్టి పెట్టడం లేదు. పైగా గోదావరి బనకచర్ల అనుసంధానం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నొక్కి చెబుతూ తెలంగాణకు స్నేహ హస్తం అందించారు. గోదావరి నదిపై ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోండి, ఎన్ని నీళ్లయినా తీసుకోండని ఒక విధంగా పరిధి దాటి స్వాగతించారు. కాని తెలంగాణ వేపు నుంచి ప్రతికూల స్పందన వచ్చి గోదావరి బనకచర్ల అనుసంధానం పైననే కాకుండా రాయలసీమ ఎత్తిపోతల పై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు

మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఆ మాట కొస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎన్ని నీళ్లయినా తీసుకోండని చెప్పడం సరికాదు. ఈ అంశంలో జల వనరులు శాఖాధికారులు ముఖ్యమంత్రికి సరైన ఫీడింగ్ ఇచ్చినట్లు లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి కావేరి అనుసంధానానికే గోదావరిలో మిగులు నీళ్లు లేవని కేంద్ర జల సంఘం తేల్చి చెప్పింది. అందుకే ఛత్తీస్‌గఢ్ మిగులు వాటా నీళ్లు డీపీఆర్ లో చేర్చారు. ఏ పథకం డీపీఆర్ ఆమోదం పొందాలన్నా కేంద్ర జల సంఘం తమ వద్ద వున్న కొలబద్ద ఆధారంగా అనుమతులు ఇస్తుంది. వాస్తవంలో తెలంగాణకు చెంది ఆరేడు ప్రాజెక్టుల డీపీఆర్‌లు నికర జలాలు లేకుండా కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్ లో వున్నాయి.

అంతర్ రాష్ట్ర జల వివాదంగా మిగిలిన గొంతెండి పోతున్న శ్రీ కాకుళం జిల్లా వాసులకు జీవధారగా వున్న వంశధార నాగావళి అనుసంధానం ఒడిశా సుప్రీంకోర్టు కెక్కినందన నిలిచి పోయి వుంది. ఒడిశాలో ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం వుంది. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఒడిశా ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపితే సులభంగా సమస్య పరిష్కారమౌతుంది. కేవలం 40 కోట్ల రూపాయల వ్యయంతో అనుసంధానం జరిగి పోతుంది. జగన్‌మోహన్ రెడ్డి ఈ పని చేయలేక 180 కోట్లతో ఎత్తిపోతల పథకం పెట్టారు. ముఖ్యమంత్రి

> సహజంగా రాష్ట్రాల మధ్య జుట్లు పందేలు పెట్టే కేంద్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా కృష్ణానది జలాల వివాద పరిష్కారానికి ట్రిబ్యునల్ నియమించింది. గాని గోదావరి నదీ జలాల పంపిణీ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుంది. కృష్ణా గోదావరి నదీజలాల వాటాలు తేల్చేందుకు ఒకే రోజు ట్రిబ్యునల్స్ వేయాలని 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్బిద్ధితో 2023 ఎన్నికల్లో తెలంగాణలో లబ్ధి పొందేందుకు నాలుగేళ్లుగా దస్త్రాలకే పరిమితమైన కృష్ణానదీ జలాల వివాద ట్రిబ్యునల్ ప్రతి పాదన దుమ్ము దులిపి ట్రిబ్యునల్ వేసి ఆంధ్ర ప్రదేశ్ ప్రజల గొంతుకోసింది.

చంద్రబాబు నాయుడు ప్రధానంగా అంతర్ రాష్ట్ర జల వివాదాలపై దృష్టి పెట్ట వలసి ఉంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి కూడా గోదావరి బనకచర్ల అనుసంధానం గురించి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పైగా జూన్ కల్లా టెండర్లు పిలవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. కాని రాష్ట్ర విభజన చట్టం మేరకు కృష్ణాగోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే ముందుగా ఆయా నదీ జలాల యాజమాన్య బోర్డుల అనుమతి అపెక్స్ కౌన్సిల్ ఆమోదం వుండాలనే అంశాన్ని తెలంగాణ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ఇప్పుడు లేవ నెత్తారు. తమాషా ఏమంటే గోదావరిపై గాని కృష్ణానదిపై గాని తెలంగాణ కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ కొత్తవే. కేసీఆర్ పాత ప్రాజెక్టులను రీ డిజైనింగ్ చేస్తున్నామని పబ్బం గడుపుకున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతి పాదించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టునే కాళేశ్వరం ప్రాజెక్టు చేశారు. అయిదేళ్ల కాలం కేసీఆర్ తో అలాయ్ బలాయ్ ఆడిన జగన్‌మోహన్ రెడ్డి మిన్న కుండిపోయారు. ఇదే ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ కు ఏకుమేకై కూర్చుండ బోతోంది. ఇప్పటికైనా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి లేఖతో సరిపెట్టకుండా ప్రధాన మంత్రి స్థాయిలో ఒత్తిడి తెచ్చి గోదావరి ట్రిబ్యునల్ నియమింప చేసుకోవలసి వుంది. ట్రిబ్యునల్ నియామకం జరిగితే తెలంగాణ వేపు నుంచి కొంత మేర ఒత్తిడి తగ్గుతుంది.

విశ్రాంత పాత్రికేయులు 9848394013

డాంగే జీవితంలో ఎగుడు దిగుళ్లు

ఆర్వీ రామారావ్

మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రగానీ, కార్మికోద్యమ చరిత్రగానీ శ్రీపాద అమృత డాంగే పేరెత్తకుండా పూర్తి కాదు. డాంగే 1925లో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మార్క్సిస్టు సిద్ధాంతవేత్తల్లో కూడా డాంగే అగ్రగణ్యులు. సాధారణంగా కమ్యూనిస్టు పార్టీలకు అధ్యక్షులు ఉండరు. కేవలం ప్రధాన కార్యదర్శులు మాత్రమే ఉంటారు. కానీ సీపీఐ చీలిన తరవాత 1980 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కి డాంగే చైర్మన్‌గా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చైర్మన్ ఉండడం చైనా కమ్యూనిస్టు పార్టీలోనే కనిపిస్తుంది. మావో చైనా కమ్యూనిస్టు పార్టీ చైర్మన్‌గా ఉండేవారు. ఈ రెండు సందర్భాలలో తప్ప కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు అంతా ప్రధాన కార్యదర్శి స్థానంలో ఉన్నవారే.

డాంగే జీవితంలో వైపరీత్యం ఏమిటంటే సీపీఐని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించిన ఆయనను కమ్యూనిస్టు పార్టీ నుంచి బహిష్కరించారు. అక్కడి నుంచే కమ్యూనిస్టు నాయకుడిగా డాంగే కీర్తి మసకబారింది. సహాయ నిరాకరణోద్యమాన్ని గాంధీ అర్ధంతరంగా ఉపసంహరించడం వల్ల అప్పటిదాకా కాంగ్రెస్ నాయకత్వంలో కొనసాగుతున్న జాతీయోద్యమంలో భాగస్వాములైన వివిధ రాజకీయ ఛాయలున్న వారిలో గాంధీపై అసంతృప్తి పెరిగింది. గాంధీ మీద అసంతృప్తి పెరగడంతో పాటే డాంగేలో మార్క్సిజం మీద ఆసక్తి పెరిగింది. 1921లో ఆయన గాంధీ వర్సెస్ లెనిన్ గ్రంథం రాశారు. ఈ గ్రంథం లెనిన్‌కు కూడా నచ్చిందంటారు. డాంగే నిశితంగా మార్క్సిజం అధ్యయనం చేయడానికి బొంబాయిలో పిండి మిల్లు యజమాని రణ్ చోడ్ దాస్ బవన్ లొట్వాలా సహాయం చాలా ఉంది. ఆయన సహాయంతోనే డాంగే మొట్టమొదటి మార్క్సిస్టు పత్రిక "సోషలిస్టు" ను నిర్వహించగలిగారు అంటారు.

డాంగే మొత్తం 16 ఏళ్ల కాలం జైలులో గడిపారు. కాన్పూర్ బోల్షెవిక్ కుట్ర కేసు, మీరట్ కుట్ర కేసులో డాంగే నిందితుడు. ఈ కేసుల్లో ఆయన జైలు శిక్ష అనుభవించ వలసి వచ్చింది. 1927 నాటికి డాంగే బొంబాయిలో కార్మిక నాయకుడిగా ప్రసిద్ధుడయ్యారు. గిర్నీ కాంగార్ యూనియన్‌కు ఆయనే అగ్రనాయకుడు. ఈ కార్మిక సంఘం వస్త్ర పరిశ్రమ కార్మికులపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేది. గిర్నీ కాంగార్ యూనియన్‌లో 324 మంది సభ్యులు ఉంటే డాంగే నాయకత్వంలో ఆ సభ్యత్వం 54,000కు పెరిగింది. డాంగే మరాఠీ పత్రిక "క్రాంతి" కూడా నడిపారు. ఇది గిర్నీ కాం గార్ యూనియన్ అధికార పత్రికగా ఉండేది. డాంగే చాలా కాలం ఏఐటీయూసీ అధ్యక్షులుగా ఉన్నారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు డాంగే కార్మికోద్యమంలో విశిష్టమైన పాత్ర పోషించారు.

డాంగే

చట్టసభల్లో కూడా డాంగేది ఎన్నదగిన పాత్రే. 1946 నుంచి 1951 దాకా బొంబాయి శాసన సభ్యుడిగా ఉన్నారు. ఆ తరవాత రెండవ, నాల్గవ లోక్‌సభ సభ్యులుగా ఉన్నారు. బొంబాయి రాష్ట్రాన్ని మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలుగా విడగొట్టడానికి సాగిన ఉద్యమంలో కూడా డాంగే చురుకుగా పాల్గొన్నారు. 1980 ఫిబ్రవరిలో డాంగే సీపీఐ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. 1981 ఏప్రిల్ 12న ఆయనను పార్టీ నుంచి బహిష్కరించారు.

ఎమర్జెన్సీ సమయంలో సీపీఐ ఇందిరాగాంధీకి మద్దతు ఇవ్వడానికి ప్రధాన కారకుడు డాంగే అంటారు. పార్టీ నుంచి బహిష్కృతుడైన మరుసటి నెలలోనే డాంగే తన కూతురు రోజాదేశ్‌పాండేతో కలిసి ఆల్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ (ఏఐసీపీఐ) ఏర్పాటు చేశారు. ఆ తరవాత యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీలో ఉన్నారు. కళాశాలలో ఉన్నప్పుడు బైబిల్ బోధించడాన్ని వ్యతిరేకించినం దుకు కళాశాల నుంచి బహిష్కరించారు. స్వరాజ్యం నా జన్మ హక్కు అన్న బాల గంగాధర్ తిలక్ ప్రభావం డాంగే మీద ఎక్కువగా ఉండేది. 1935లో జైలు నుంచి విడుదలైన తరవాత డాంగే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పర్యటించి అనేక ఉపన్యాసాలు ఇచ్చారు. దీనితో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఉన్న చాలా మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. డాంగేకు అమితమైన సాహిత్యాభినివేశం ఉండేది. సంస్కృతం చదువుకున్న వారు. ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా కమ్యూనిస్టు ఉద్యమంలో డాంగే పాత్ర విస్మరించడానికి వీలులేదు. సీపీఐలోనూ, కార్మికోద్యమంలోనూ శిఖరాయమాన పాత్ర పోషించిన డాంగే చివరకు ఒంటరిగా మిగిలిపోవడం పెద్ద విషాదం.

మోసమే మోదీ నైజం

- ఈవీఎంల్లో జరుగుతున్నదంతా అదే...
- ఏదో ఒక రోజు దేశాన్ని అమ్మేస్తారు
- పార్టీకి పని చేయనివారు రిటైరవ్వాల్సిందే
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

అహ్మదాబాద్ : ప్రధాని మోదీ నైజం మోసమని... ఈవీఎంల్లో జరుగుతున్నదంతా అదేనని... ఏదొక రోజు దేశాన్ని అమ్మేస్తాడని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విపక్షాలను మోసపూరితంగా ఓడించారని అన్నారు. పార్టీ పనిలో సహాయం చేయని వారు తప్పుకోవాలని కూడా శ్రేణులను హెచ్చరించారు. ఇక్కడ సబర్మతీ నది ఒడ్డున జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఖర్గే తన ప్రారంభ ప్రసంగంలో... ఎన్నికలలో 'మోసం' అని కూడా ఆరోపించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'బ్యాలెట్ పేపర్‌తో దేశంలో ఎన్నికలను నిర్వహించాలి. యావత్ దేశంలోని యువతరం గళమెత్తి మాకు బ్యాలెట్ పేపర్ కావాలని తప్పకుండా అంటారు. ఈవీఎంల గురించి మేం ప్రశ్నిస్తే, వాళ్లు నిరూపించమని అడుగుతారు. అధికార పార్టీకి లబ్ధి చేకూరేలా, విపక్ష పార్టీలకు నష్టం జరిగేలా వాళ్లు ఈవీఎంలలో మార్పులు చేయించుకున్నారు. మహారాష్ట్ర లాగే హర్యానాలో జరిగింది. ఓటర్ల జాబితాలను తప్పులతడకగా ఇష్టానుసారంగా తయారు చేస్తున్నారు. ఆశ్చర్యకరంగా మహారాష్ట్రలో బీజేపీకి 90 శాతం అసెంబ్లీ సీట్లు వచ్చాయి. గతంలో ఎన్నడూ ఆ పార్టీకి అన్ని సీట్లు రానే లేదు. ఇదంతా మోసం వల్లే సాధ్యమైంది. వాళ్లు ప్రజాస్వామ్యాన్ని కాల రాస్తున్నారు. మేం తప్పకుండా నిజాన్ని బయటపెడతాం. దొంగ తప్పకుండా దొరుకుతాడు. మా న్యాయవాదులు, నాయకులు దానిపై పనిచేస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలేసి బ్యాలెట్ పేపర్ వైపు మొగ్గు చూపుతున్నాయని.. కానీ మన ఎన్నికల సంఘం వీటిని పట్టించుకోవడం లేదని, నకిలీ ఓటర్ల జాబితాలను తయారు చేయడం మహారాష్ట్ర ఎన్నికల్లో చూశామని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కరతాళ ధ్వనుల మధ్య 'పార్టీ పనిలో సహాయం చేయని వారు విశ్రాంతి తీసుకోవాలని, బాధ్యతలు నిర్వర్తించని వారు తప్పక రిటైర్మెంట్ తీసుకోవాలని నేను కూడా చెప్పాలనుకుంటున్నాను' అంటూ గట్టిగా హెచ్చరించారు. సంస్థలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల పాత్ర బాగా పెరుగుతుందని, ఇక నుంచి పార్టీ అభ్యర్థుల ఎంపికలో వారికే చెప్పాలని ఖర్గే ఉద్ఘాటించారు. సంస్థ ఏర్పాటులో జిల్లా అధ్యక్షుల పాత్ర కీలకం కానుందని, అందువల్ల ఏఐసీసీ మార్గదర్శకాల ప్రకారం వారి నియామకం కచ్చితంగా, నిష్పక్షపాతంగా జరగాల్సి ఉందన్నారు. సబర్మతి ఒడ్డు నుంచి న్యాయ మార్గంలో నడవడానికి సంకల్పం, పోరాటం, అంకితభావం సందేశాన్ని కాంగ్రెస్ తీసుకోబోతోందని అన్నారు.

రెండో స్వాతంత్ర్య ఉద్యమం చేస్తున్నాం

భారతదేశ స్వాతంత్ర్యం కోసం మనం మరోసారి పోరాడుతున్నామని, ఈ రెండవ స్వాతంత్ర్య యుద్ధంలో శత్రువులు... అన్యాయం, అసమానత, వివక్ష, పేదరికం, మతతత్వమని తెలిపారు. ఒకే ఒక్క తేడా ఏమిటంటే, అప్పట్లో విదేశీయులు అన్యాయాన్ని, పేదరికాన్ని, అసమానతలను ప్రోత్సహించేవారని, ఇప్పుడు మన ప్రభుత్వమే ఆ పని చేస్తోందని ఆయన అన్నారు. అప్పుడు విదేశీయులు మతతత్వాన్ని ఉపయోగించుకునేవారు. నేడు మన స్వంత ప్రభుత్వం దానిని ఉపయోగించుకుంటోంది' అని దుయ్యబట్టారు. 'అయితే ఈ యుద్ధంలో కూడా గెలుస్తాం' అని ఖర్గే అన్నారు. ప్రభుత్వంపై విరుచుకుపడుతూ... కొన్ని రోజులకొకసారి కొత్త నినాదాలు ఇస్తున్నారని, అయితే దీని వెనుక కేవలం ప్రజల దృష్టి మరల్చడమేనని అన్నారు. ఆశ్రిత పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను అమ్ముతోందని, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం నిదానంగా, నిదానంగా, నిదానంగా ముగుస్తోందన్నారు. వనరులను కొద్దిమంది ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగించి గుత్తాధిపత్యాన్ని నెలకొల్పుతున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు నిర్వీర్యమవుతున్నాయన్నారు. ఇది ఇలాగే కొనసాగితే నరేంద్ర మోదీ దేశాన్ని మొత్తం అమ్మేసి వెళ్లిపోతారని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సంస్థలు, సూత్రాలపై దాడులు జరుగుతున్నాయని అని పేర్కొంటూ... వాటిని కాపాడుకునేందుకు పోరాడాలని అన్నారు. ప్రభుత్వం తన ఇష్టానుసారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను నిర్వహించిందని ఆరోపించారు. స్పీకర్ ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రజల సమస్యలపై చర్చకు బదులు, మత విభజన అజెండాగా ప్రభుత్వం అర్థరాత్రి వరకు చర్చ నిర్వహించిందని, వక్ఫ్ (సవరణ) బిల్లుపై చర్చను ప్రస్తావిస్తూ ఖర్గే అన్నారు. మణిపూర్‌పై ఉదయం 4 గంటలకు చర్చ జరిగిందని, మరుసటి రోజు నిర్వహించాలని అభ్యర్థించినప్పటికీ ప్రభుత్వం అంగీకరించలేదని తెలిపారు. ప్రభుత్వం ఏదో దాచాలని చూస్తున్నదని ఆయన ఆరోపించారు. అమెరికా సుంకాల విధింపు అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తేందుకు ప్రతిపక్షాలను అనుమతించలేదన్నారు.

మతం పేరుతో రెచ్చగొడుతున్నారు...

500 ఏళ్ల నాటి సమస్యలను లేవనెత్తడం ద్వారా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం కాకుండా ప్రజలను విభజించి వారి మధ్య ద్వేషాన్ని పెంచాలని చూస్తున్నారని అధికార బీజేపీ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఇలాంటి ప్రమాదకరమైన ఆలోచనలను ఎప్పుడూ సమర్థించరాదని ఖర్గే అన్నారు. ప్రతి మసీదు కింద శివలింగాల కోసం వెతకవద్దని ఆర్ఎస్ఎస్ చీఫ్ తమ శ్రేణులను కోరారని, అయితే వారు అలా చేస్తూనే ప్రజలను విభజించారని ఖర్గే విమర్శించారు. మోదీ నిప్పులు చెరుగుతున్నారని, ఆర్ఎస్ఎస్ వ్యక్తులు దానికి ఆజ్యం పోస్తున్నారని ఆరోపించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లోని రామమందిరంలో కాంగ్రెస్‌కు చెందిన టికారామ్ జుల్లీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత దానిని 'శుద్ధి చేయడానికి' దాని నాయకుడు గంగాజలాన్ని చల్లిన తర్వాత బీజేపీకి 'దళిత వ్యతిరేక మనస్తత్వం' ఉందని ఆయన విమర్శించారు. దేశ వ్యాప్త కుల గణన కోసం ఖర్గే ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ రాజకీయ ప్రయోజనాల కోసం ఓబీసీ హోదాను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచడం, వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభుత్వాన్ని నిందించారు. అంతకుముందు, ఫిబ్రవరి 2023 రాయ్‌పూర్ సెషన్ తర్వాత మరణించిన కాంగ్రెస్ సభ్యులకు నివాళులు అర్పిస్తూ కాంగ్రెస్ సంతాప తీర్మానాన్ని ఆమోదించింది. గత ఏడాది డిసెంబరులో మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పార్టీ ఘనంగా నివాళు లర్పించింది.

కాంగ్రెస్ ఆశాజనకంగా ఉండాలి

శశి థరూర్

అహ్మదాబాద్ : కాంగ్రెస్ ఆశాజనకంగా ఉండాలి... ఆగ్రహంతో కాదు. గతానికి సంబంధించిన పార్టీగా కాకుండా భవిష్యత్తుకు సంబంధించిన పార్టీగా... కేవలం విమర్శలకు మాత్రమే కాకుండా సానుకూల కథనం ఉన్న పార్టీగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ అన్నారు. ఉత్తరాదిని దక్షిణాది నుంచి విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. భారతదేశం ఆలోచన ఏమిటంటే, ఒక మంచి గుజరాతీ, మంచి ముస్లిం, మంచి భారతీయుడు ఒకేసారి కావచ్చన్నారు. ఇక్కడ సబర్మతీ నది ఒడ్డున జరిగిన ఏఐసీసీ సమావేశంలో థరూర్ మాట్లాడుతూ 'నేను నిన్న సీడబ్ల్యూసీ సమావేశంలో చెప్పినట్లు, కాంగ్రెస్ కేవలం విమర్శలు మాత్రమే కాదు. ఆశల పార్టీగా ఉండాలి. మనం ఇక్కడ ఉన్నాం. పోరాడతాం. పరిష్కరించుకుంటాం. భవిష్యత్‌పై దృష్టి పెడతాం. అందరికీ మంచి భారతదేశాన్ని నిర్మిస్తామనే సందేశాన్ని దేశానికి అందజేస్తామని నేను ఆశిస్తున్నాను' అని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ల భూమి నుంచి కాంగ్రెస్ పునరుజ్జీవనం పొందుతోందని, రేపటి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని థరూర్ 'మనం ఇక్కడ ఉన్నాం' అని తెలిపారు. మూడు దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్న గుజరాత్‌లో మనం కొత్త పునరుజ్జీవనం అంచున నిలబడి ఉన్నాం. ఇక్కడ మనందరికీ ఇది ఒక సంబరాలు. 2024 మాకు శుభవార్త, చెడు వార్తలను అందించింది. లోక్‌సభ ఎన్నికలలో ఒక మంచి ఫలితం, ఇక్కడ మేము మన బలాన్ని రెట్టింపు చేశాం. కానీ తరువాత జరిగిన అనేక రాష్ట్రాల ఎన్నికలలో చెడు వార్తలు' అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అన్నారు. ఏఐసీసీ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ థరూర్ ఈ తీర్మానం కాంగ్రెస్ అదృష్టాన్ని మలుపు తిప్పాలని అన్నారు. 'మనం ఇంతకు ముందు గెలిచిన ఓట్లను నిలుపుకోవాలి. పునరుద్ధరించాలి. గత మూడు ఎన్నికలలో మనం గెలవలేకపోయాం. ఈ తీర్మానం మనల్ని నడిపిస్తుంది. ఇది నిర్మాణాత్మక విమర్శలను వ్యక్తీకరించే తీర్మానం' అని అన్నారు. పార్టీ జాతీయవాదాన్ని పక్కకు వదిలివేయడం కంటే ముందుగా ప్రదర్శించడం ద్వారా తీర్మానం ప్రారంభమవుతుందని థరూర్ సూచించారు. 'కానీ మన జాతీయవాదం మన ప్రజలందరి శ్రేయస్సులో ఉంది. ఇది మన సమాజంలోని బలహీనులకు సామాజిక న్యాయం అనే కోణంలో ఉంది. ఈ తీర్మానం ప్రధాన ఇతివృత్తం బలహీనులు, అట్టడుగు వర్గాలు, ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలు' అని తెలిపారు. 'మన రాజ్యాంగం స్పష్టం చేసినట్లుగా, మీరు ఏ భాష మాట్లాడతారు, మీరు ఏ రాష్ట్రం నుండి వచ్చారు, మీరు ఏ మతాన్ని విశ్వసిస్తున్నారు, మీరు ఏ కులానికి చెందినవారు, మీరు భారతీయుడని, ప్రతి భారతీయుడిలాగే మీకు సమానమైన హక్కులు ఉన్నాయని రాజ్యాంగం నిర్ధారిస్తుంది. కాంగ్రెస్ ఎల్లప్పుడూ దాని కోసం నిలుస్తుందని శశి థరూర్ అన్నారు.

13వసారి డేరా బాబాకు పెరోల్

చండీగఢ్ : అత్యాచారం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా ఆశ్రమ అధిపతి గుర్మీత్ రాం రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు బుధవారం మరోసారి జైలు నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం రోహ్‌తక్‌లోని సునారియా జైల్లో శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్‌కు 21 రోజుల పాటు పెరోల్ లభించినట్లు ఆయన న్యాయవాది జితేంద్ర ఖురానా తెలిపారు. డేరా బాబాకు ఇలా పెరోల్ లభించడం ఇది 13వసారి. చట్టబద్ధంగానే ఈ పెరోల్ లభించిదని జితేంద్ర ఖురానా వెల్లడించారు. ఒక ఖైదీకి సంవత్సరంలో 70రోజుల వరకు పెరోల్ లభిస్తుంది. రహీమ్‌కు పెరోల్ మంజూరు చేయడం పూర్తిగా చట్టపరమైన హక్కు. ఎన్నికలకు ముందు 30రోజల పాటు పెరోల్ లభించినప్పుడు పదే పదే విమర్శలు చేశారు. ఇప్పుడు ఎన్నికలు లేవు. ఎలాంటి రాజకీయ ఉద్యమాలు లేవు. పెరోల్‌కు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని ఖురానా పేర్కొన్నారు. డేరా బాబా ఇప్పటికే 13సార్లు జైలు నుంచి తాత్కాలికంగా జైలు నుంచి బయటకు వచ్చారు. మొదట 2020లో ఒకరోజు పెరోల్ మంజూరు లభించింది. ఆ తర్వాత 2021లో 12 గంటలు, 2022లో 21 రోజులు,30రోజుల పెరోల్‌కు మంజూరు లభించింది. 2023లో 40రోజుల పెరోల్‌ను రెండు దఫాలుగా, 2024లో 50రోజులు, 20రోజుల చొప్పున పెరోల్ లభించింది. డేరా బాబా జైలు నుంచి విడుదల కావడం ఈ ఏడాదిలోనే ఇది రెండోసారి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు అంటే జనవరిలో 30 రోజుల పెరోల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. పెరోల్‌పై బయటకు వచ్చాక ఆయన సిర్సాలో ఉన్న డేరా ప్రధాన కార్యాలయంలో ఉండనున్నారు.

ఢిల్లీలో పెట్రోల్, సీఎన్‌జీ బైకులపై నిషేధం?

న్యూఢిల్లీ: పెట్రోల్, సీఎన్‌జీతో నడిచే ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించాలని ఢిల్లీ ప్రభుత్వం భావిస్తోంది. ఢిల్లీ సర్కార్ అందుకోసం ఈవీ పాలసీ 2.0 ముసాయిదాను సిద్ధం చేస్తోంది. మంత్రివర్గం ఆమోదం పొందాక వచ్చే ఏడాది ఆగస్టు 15 నుంచి పెట్రోల్, సీఎన్‌జీతో పాటు నడిచే బైక్స్‌ను నిషేధించనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు వేసిన ప్రణాళికలో భాగంగా సీఎన్‌జీతో నడిచే బైకులు, ఆటోలతోపాటు శిలాజ ఇంధనంతో నడిచే వాహనాలను దశలవారీగా తొలగించాలని అక్కడి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025 ఆగస్టు 15 నుంచి ఢిల్లీలో కొత్త సీఎన్‌జీ వాహనాల రిజిస్ట్రేషన్లకు అనుమతి లేదు. అదేరోజు నుంచే సీఎన్‌జీ ఆటోల పర్మిట్ల రెన్యువల్స్ కూడా నిలిపివేశారు. వాటి బదులుగా... ఎలక్ట్రిక్ ఆటో పర్మిట్లు మాత్రమే జారీ చేస్తున్నారు. వ్యర్థాల సేకరణను నిర్వహించే ప్రభుత్వ వాహనాలు, సిటీ బస్సులపై కూడా ఢిల్లీ సర్కార్ దృష్టి సారించింది. 2027 డిసెంబర్ 31వ తేదీ నాటికి 100 శాతం విద్యుత్ చెత్త వాహనాలు ఉపయోగించేలా లక్ష్యం పెట్టుకుంది. శిలజ ఇంధనంతో నడిచే వాహనాలను దశలవారీగా తొలగించాలని అనుకుంటోంది. ఇప్పటికే రెండు వాహనాలను కలిగి ఉంటే, యజమాని తదుపరి కొనుగోలు తప్పనిసరిగా ఎలక్ట్రిక్ కారు అయి ఉండాలని కొత్త ముసాయిదా సిఫార్సు చేస్తోంది. ముసాయిదా పాలసీ చాలా వరకు పూర్తి అయినప్పటికీ, ద్విచక్ర వాహనాలకు సంబంధించిన నిబంధనను కేబినెట్ ఆమోదానికి ముందు సవరించవచ్చని అధికారులు తెలిపారు. మార్చి 31న గడువు ముగిసిన ప్రస్తుత ఈవీ పాలసీని మరో 15 రోజుల పాటు పొడిగించారని చెప్పారు. శిలాజ ఇంధన వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడమే కొత్త పాలసీ లక్ష్యమని తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయం

సీఎం మమత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అన్ని వర్గాల మైనారిటీలతోపాటు వారి ఆస్తులను రక్షిస్తానని తెలిపారు. రాజకీయం కోసం కొందరు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తారని, వాటిని పట్టించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కోల్‌కతాలో జైన సమాజం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... "వక్ఫ్ చట్టం అమలుతో మీరు బాధపడుతున్నారని నాకు తెలుసు. నమ్మకంగా ఉండండి. అందరూ కలిసి ఉంటామని సందేశం ఇవ్వండి. విభజించు-పాలించు అనేది జరగదు. వక్ఫ్ అమలు చేయడం కన్నా ముందు బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతోందో చూడండి. అందుకే వక్ఫ్ చట్టం అమలు చేయబోం" అని మమత స్పష్టం చేశారు. 'బెంగాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం అన్నీ కలిసి ఉన్నాయని చరిత్ర చెబుతోంది. విభజన తరువాత వారు ఇక్కడ నివసిస్తున్నారు. వారికి రక్షణ కల్పించడం మా పని. మనం జీవించు, జీవించనివ్వు అనే సందేశాన్ని ఇవ్వాలి. ఎవరైనా మిమ్మల్ని రాజకీయంగా సమావేశమవ్వమని రెచ్చగొడితే, దయచేసి అలా చేయవద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దీదీ మిమ్మల్ని, మీ ఆస్తిని రక్షిస్తుందని దయచేసి గుర్తుంచుకోండి. మనం కలిసి ఉంటే, ప్రపంచాన్ని జయించగలం' అని మమత అన్నారు. అందరూ ఐక్యంగా ఉండాలని... ప్రతి మతం, కులం మానవత్వం కోసమే ప్రార్థిస్తాయని చెప్పారు. 'దుర్గా పూజ, కాళీ పూజ, జైన, బౌద్ధ దేవాలయాలు, గురుద్వారా, చర్చి, గురు రవిదాస్ ఆలయానికి నేను వెళ్తాను. రాజస్థాన్‌లో అజ్మీర్ షరీఫ్‌తో పాటు పుష్కర్‌లోని బ్రహ్మ ఆలయాన్ని కూడా సందర్శించాను' అని ఆమె గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 రాష్ట్రపతి ఆమోదం పొందిన పిమ్మట మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన సంగతి విదితమే.

భగ్గుమన్న భానుడు

- రాజస్థాన్‌లో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- అనేక రాష్ట్రాల్లో సాధారణం కంటే అధికం
- ఉక్కపోతతో అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలను వేడిగాలులు వణికిస్తున్నాయి. దేశరాజధాని ఢిల్లీ సహా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఎడారి రాష్ట్రం రాజస్థాన్ లోని బార్మర్‌లో దేశంలోనే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడ మంగళవారం 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది సాధారణం కంటే 7.6 డిగ్రీలు ఎక్కువ అని పేర్కొంది. జైసల్మేర్‌లో 45 డిగ్రీల సెల్సియస్, చిత్తోర్‌గఢ్‌లో 44.5, బికనీర్‌లో 44.4, గంగానగర్‌లో 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7 నుంచి 9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ అని ఐఎండీ తెలిపింది. ఢిల్లీలోని ప్రాథమిక వాతావరణ కేంద్రం సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సఫ్దర్‌జంగ్‌లో సోమవారం ఉష్ణోగ్రతలు 40.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది. ఇది సాధారణం కంటే 5.1 డిగ్రీలు ఎక్కువ. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని మొత్తం 27 స్టేషన్లలో 43 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. వాటిలో కనీసం 19 స్టేషన్లలో వేడిగాలులు నుండి తీవ్రమైన వేడిగాలులు నమోదైనట్లు పేర్కొంది. గుజరాత్‌లోని సురేంద్ర నగర్‌లో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజ్‌కోట్‌లో 44 డిగ్రీల సెల్సియస్, అమ్రేలిలో 43.8, మహువ, కాండ్లాలో 43.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహువలో సాధారణం కంటే 8.3 డిగ్రీలు ఎక్కువ అని ఐఎండీ పేర్కొంది. మహారాష్ట్రలోని అకోలాలో 44.1 డిగ్రీల సెల్సియస్, నందూర్‌బార్‌లో 43.5, జల్గావ్‌లో 43.3, అమరావతిలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని గుణ, రత్లామ్‌లలో ఉష్ణోగ్రతలు వరుసగా 43.4, 43.2 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఈ నెల 10, 11 తేదీల్లో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడిగాలుల పరిస్థితుల నుంచి ఉపశమనం లభించొచ్చని ఐఎండీ అంచనా వేసింది.

బాలికపై అత్యాచారం కేసులో తొమ్మిదిమంది అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నగరంలో 19 ఏళ్ల బాలికపై 23 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారం చేసిన కేసులో పోలీసులు ఇప్పటివరకు తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి, వారందరినీ రిమాండ్‌కు పంపారు. బుధవారం అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ విదుష్ సక్సేనా ఈ మేరకు సమాచారం అందించారు. మిగిలిన నిందితులను అరెస్టు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. లాల్‌పూర్ పాండేపూర్ ప్రాంతంలో బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసు దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

అసలు ఏం జరిగిందంటే... వారణాసిలో 19ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసిన దుండగులు ఆమెపై వారం రోజుల పాటు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఉత్తర వారణాసికి చెందిన బాలిక మార్చి 29న స్నేహితురాలి ఇంటికి వెళ్లేందుకు తన ఇంటి నుంచి బయల్దేరింది. గతంలో పలుమార్లు ఇలాగే వెళ్లినా.. సురక్షితంగా ఇంటికి చేరుకొనేది. కానీ, ఆరోజు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏప్రిల్ 4న కిడ్నాపర్లు ఆమెను ఓ రోడ్డులోని కూడలిలో మత్తు మందు ఇచ్చి వదిలి పెట్టగా... సమీపంలోని తన స్నేహితురాలి ఇంటికి ఎలాగో చేరుకుంది. దీంతో వారు ఆమెను ఇంటికి చేర్చారు. దీంతో తనపై జరిగిన దారుణాన్ని బాలిక తన తండ్రికి చెప్పడంతో కుటుంబ సభ్యులు ఏప్రిల్ 4న పోలీసులను ఆశ్రయించారు. వివిధ ప్రదేశాలకు తీసుకెళ్లి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాలిక చెప్పినట్లు తెలుస్తోంది.

వక్ఫ్ బిల్లుపై చర్చకు డిమాండ్... ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ

జమ్మూ: వక్ఫ్ బిల్లుపై చర్చించాలని పట్టుబడుతున్నా జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మూడు రోజులుగా వాయిదాల పర్వం నడుస్తోంది. అయితే బుధవారం కొందరు ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణంలో ఘర్షణ పడ్డారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. అసెంబ్లీలో లోపల ఆప్ ఎమ్మెల్యే మెహరాజ్ మాలిక్, పీడీపీ ఎమ్మెల్యే వహీద్ పారా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండు వర్గాలుగా మారిన ఎమ్మెల్యేలు... ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. గత రెండు రోజుల నుంచి కూడా అసెంబ్లీని స్పీకర్ అబ్దుల్ రహీమ్ వాయిదా వేశారు. అధికార నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లిన నినాదాలు చేపట్టారు. ఇటీవల కేంద్రం ఆమోదించిన వక్ఫ్ బిల్లుపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునిల్ శర్మ కూడా వెల్‌లోకి దూసుకెళ్లిన ఎన్‌సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు సభలో ధర్నా చేపట్టారు. దీంతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఆ సమయంలో హౌస్‌ను స్పీకర్ వాయిదా వేశారు.

గృహ రుణాలపై తగ్గనున్న వడ్డీరేట్లు

ముంబై : ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు తగ్గించడం వల్ల ... బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా పేర్కొన్నారు.

మర్చంట్ లావాదేవీల పరిమితి పెంచుకోవచ్చు

ఆర్‌బీఐ

ముంబై: డిజిటల్ చెల్లింపులపై రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాపారులకు కొనుగోలుదారులు చేసే పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) చెల్లింపుల పరిమితిని ఉపయోగించుకునేవారి అవసరాలకు అనుగుణంగా పెంచుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ సందర్భంగా యూపీఐ చెల్లింపులపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించారు. 'వినియోగాన్ని పెంచి యూపీఐ వ్యవస్థను మరింత సమర్థంగా మార్చేందుకు మేం ఈ ప్రతిపాదన చేస్తున్నాం. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో చర్చించి... యూజర్ల అవసరాలకు అనుగుణంగా పీ2ఎం లావాదేవీల పరిమితిని పెంచుకోవచ్చు' అని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. అయితే, ఈ పెంపు వల్ల పొంచి ఉన్న ముప్పుల నుంచి తగిన రక్షణ చర్యలు కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని మల్హోత్రా గుర్తు చేశారు. ఈ పరిమితులపై ఎన్‌పీసీఐ నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకునే హక్కు బ్యాంకులకు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం వ్యక్తుల నుంచి వ్యక్తులకు, వ్యక్తి నుంచి మర్చంట్ యూపీఐ లావాదేవీలపై రూ.లక్ష వరకు పరిమితి ఉంది. అయితే, కొన్ని ప్రత్యేక అవసరాల కోసం పీ2ఎం చెల్లింపులపై రూ.రెండు లక్షలు, రూ.ఐదు లక్షల వరకు పరిమితి ఉంది. పీ2ఎం లావాదేవీలపై ఈ పరిమితిని పెంచుకోవచ్చని తాజాగా ఆర్‌బీఐ చెప్పింది. అయితే, పీ2పీ చెల్లింపుల పరిమితిలో ఎలాంటి మార్పు ఉండదు.

ఎండాకాలంలో దుప్పట్ల పంపిణీ

మంత్రిపై విమర్శల వెల్లువ

పాట్నా: ఓ వైపు వేసవిలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. అయితే ఒక మంత్రి వినూత్నంగా ఎండాకాలంలో పేదలకు చలి దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. బీహార్‌లోని బెగుసరాయ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీహార్ క్రీడల మంత్రి సురేంద్ర మెహతా ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గ పరిధిలోని అహియాపూర్ గ్రామానికి చెందిన 500 మంది పేద ప్రజలకు చలి దుప్పట్లు పంపిణీ చేశారు. కాగా, మంత్రి సురేంద్ర మెహతా ఈ విషయాన్ని చాలా గొప్పగా తన సోషల్ మీడియా ఖాతాలో చెప్పుకున్నారు. 'అంత్యోదయ, దేశ నిర్మాణ స్ఫూర్తితో పని చేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బచ్వారా అసెంబ్లీ నియోజకవర్గంలోని గోవింద్‌పూర్-2 పంచాయతీలోని అహియాపూర్ గ్రామంలో ఈ రోజు వేడుకలు జరుపుకున్నాం. ప్రజలను బట్టలతో సత్కరించాం' అని ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రజలకు చలి దుప్పట్లు పంపిణీ చేసిన ఫొటోలు, వీడియో క్లిప్స్‌ను అందులో షేర్ చేశారు. మరోవైపు భగభగమండే ఎండాకాలంలో మంత్రి సురేంద్ర మెహతా పేద ప్రజలకు చలి దుప్పట్లు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చాలా మంది వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలను ఆకట్టుకునేందుకు అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఇలాంటి స్టంట్లు చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శించారు.

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో మెగా డీల్

న్యూఢిల్లీ: భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్ దేశంతో మెగా డీల్ కుదుర్చుకుంది. రూ.63 వేల కోట్ల విలువైన ఈ గవర్నమెంట్ టు గవర్నమెంట్ డీల్ పై రెండు ప్రభుత్వాలు త్వరలో సంతకాలు చేయనున్నాయి. ఒప్పందంలో భాగంగా భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వ వర్గాలు బుధవారం ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించాయి. అయితే ఈ ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

విశాలాంధ్ర హైదరాబాద్

నేడు ముంబైకి మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 10న ముంబైలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. ముంబై పోవై లేక్‌లో (8 నుంచి 10వ తేదీ వరకు) జరుగుతున్న 20వ దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్మెంట్ కాన్ఫరెన్స్, వర్క్ షాప్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొననున్నారు. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి జూపల్లి భరోసా కల్పించనున్నారు. తెలంగాణ నూతన పర్యాటక పాలసీతో పాటు ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంలో ఉన్న అవకాశాలను మంత్రి వివరించనున్నారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలను వివరించి ఇన్వెస్టర్లను తెలంగాణకు మంత్రి జూపల్లి ఆహ్వానించనున్నారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సమీకరించడం తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా తెలిపారు.

బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్, చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం. సి.శ్రీనివాస్ (ఎల్ఓసి రూ.85 వేలు, ఎమ్.మధుసూదన్ సిఎంఆర్ఎఫ్ క్రింద రూ.45 వేలు, మొత్తం రూ.1,30,000 చెక్కులు మంజూరు కాగా బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బోయిన్‌పల్లి క్యాంప్ ఆఫీసులో బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సంక్షేమ సహాయనిధి పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పరశురాం రెడ్డి, వెంకన్న, అనిల్ కిషోర్, చిన్న యాదవ్, సురేష్, బాలకృష్ణ, బంటి, హేమంత పాల్గొన్నారు.

ఆనందబాగ్ రైల్వేస్టేషన్‌కు అనుమతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనందబాగ్ రైల్వే స్టేషన్ సాధన సమితి సభ్యులు పి.మురళీకృష్ణ, బి.ఎస్.ఆర్.కే.శాస్త్రీ, కె.నాగేశ్వర్ రావు, జెడ్ఆర్‌యుసిసి మెంబర్ నూర్ మల్కాజిగిరి కార్పొరేటర్ వి.శ్రవణ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌ను ఆనందబాగ్ ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపి ఈటల రాజేందర్ తానూ రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపానని త్వరలో స్టేషన్ నిర్మాణం జరుగుతుందని తెలియచేశారు. ట్రైన్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్, ఎం.పి.ఈటెల రాజేందర్, కార్పొరేటర్ వి.శ్రవణ్‌లకు ఆనందబాగ్ స్టేషన్ సాధన సమితి తరఫున ధన్యవాదాలు తెలిపారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని యాప్రాల్‌లో బుధవారం సిపిఐ పార్టీ అల్వాల్ మండల సమితి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల కార్యదర్శి కే.సహదేవ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపైన భారం మోపుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం మతకల్లోలాలు సృష్టిస్తూ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని సృష్టిస్తున్నారన్నారు. కులాల మధ్య, మతాల మధ్య గందరగోళ వాతావరణం రేపుతున్నారని, మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించేంత వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగయ్య, మండల సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, కార్యదర్శి నర్సింలు, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై.వెంకటేష్, బి.నరేంద్ర, చారి, ఏ.బాబు, విజయ్ కుమార్, టి.కృష్ణ, ఎం.కొండయ్య, రమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ముజ్రా పార్టీని భగ్నం చేసిన ఎస్ఓటి పోలీసులు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండలంలోని హెత్ బార్ పల్లి గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో మంగళవారం రాత్రి సమయంలో నమ్మదగిన సమాచారం ప్రకారం పార్టీ నిర్వాహకులు గంజాయి, డ్రగ్స్, మద్యం, అశ్లీల నృత్యాలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్ఓటి పోలీసులు ఫామ్ హౌస్ పై రైడ్ చేయగా అందులో7 మహిళలు13 మంది పురుషులు అదుపులోకి తీసుకున్నారు అని స్థానిక సీఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ రుక్మాన్ అనే వ్యక్తి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, ముజ్రా పార్టీని నిర్వహించాలని అతనికి పరిచయం ఉన్న అద్దు అనే వ్యక్తితో గాంజా డ్రగ్స్ తీసుకురావడానికి ప్లాన్ చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారందరూ వ్యాపారస్తులేనని తెలిపారు. పార్టీ జరుపుతున్న ప్రదేశంలో తనిఖీ నిర్వహించగా 70 గ్రాముల గంజాయి, 3లీటర్స్ లిక్కర్, 4బీరు, బాటిల్స్, బీజర్ బాటిల్స్, కండోమ్ ప్యాకెట్లు15, 6కార్లు, మొబైల్ ఫోన్లు 25, ఓసిడి పేపర్ ఫ్లాంట్స్ ఉక్కా పాట్స్‌ను సీజ్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు. ఫామ్ హౌస్ యజమాని అబ్దుల్ బిన్ సమాచారం అందిందని రికార్డు పరంగా కూడా అతనే యాజమానిగా గుర్తించామని సీఐ తెలిపారు. ఇప్పటికైనా మండల కేంద్రంలోని ఫామ్ హౌస్ ఓనర్లకు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పర్మిషన్లు ఉండవని ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిఎన్ఎస్ కొత్త సెక్షన్ ప్రకారం 144 క్లాస్ టు బి.ఎన్.ఎస్, వైలేషన్ చేసినందుకు 223,292, బి.ఎన్.ఎస్, గాంజా కలిగి ఉన్నందుకు 8సి రెడ్ విత్ 20బి, క్లాస్ టు ఎ.25,29, ఎంపీపీ ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు, లిక్కర్ కూడా కలిగి ఉన్నందుకు 34ఎ, ఎక్సైజ్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా సేవలందించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్ : పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడంతో పాటు అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా అంగన్వాడి టీచర్లు పనిచేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలపై మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావుతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు అత్యధికంగా పిల్లలు హాజరయ్యేలా చూడడంతో పాటు వారికి పోషక విలువలు ఉన్న ఆహారం, మెరుగైన సేవలు అందించి అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా చూడాలని, హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. లక్ష్యం మేరకు ప్రతి సూపర్వైజర్ నెలకు 15 సెంటర్లను, సిడిపిఓ 10 సెంటర్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు పిల్లలు, గరిజేలు వచ్చేలా చూడాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం తక్కువగా ఉన్న అంగన్వాడి టీచర్లు తమ పనితీరులు మెరుగుపరుచుకోవాలని కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఆరోగ్యరీత్యా నాణ్యమైన పోషక విలువల గల ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా పనిచేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాతో పాటు మరికొన్ని అంగన్వాడీలలో పిల్లల హాజరు శాతం పెంచాలని లేనియెడల సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్ జిల్లాలోని సీసీఐ, శిశు విహార్, అన్ని అంగన్వాడి కేంద్రాలలోని 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆర్‌బిఎస్‌కే వైద్యులచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆరోగ్యరీత్యా వివిధ రకాల టీకాలు అందించాలని అలాగే పుట్టుక లోపాలు, ఎదుగుదల లోపాలు, అనుకున్న దాని కంటే ఎక్కువ బరువుతో పాటు వివిధ సమస్యలతో బాధ పడుతున్న వారికి గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణ, శిశు విహార్, చిల్డ్రన్ హోమ్, రెస్క్యూ హోం అలాగే సఖి కేంద్రం నిర్వహణ, పోస్కో చట్టం అమలు, భేటీ బచావో-బేటి పడావో, హెల్ప్ లైన్ నిర్వహణ జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పోషణ పక్షం గోడపత్రికను ఆవిష్కరించి పోషణ పక్షం వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆ దిశగా అనుబంధ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. డిడబ్ల్యు వో అక్కేశ్వరరావు, డిఐఓ డాక్టర్ శ్రీధర్, సిడిపివోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ముందు ఏఐకెఎస్ ధర్నా

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకెఎస్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు డి.జంగయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయానికి పెట్టుబడి సహాయం 6వేల నుండి 18 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చినరెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ హాజరై రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల వరకు, 2లక్షల పైన ఉన్న రుణ మాఫీ రైతులందరికీ పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని, రైతు భరోసా సాగయ్యే భూములన్నింటికీ యుద్ధ ప్రాతిపదికన ఇవ్వాలని, రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని, వర్షాలు, వడగళ్ళకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, మిర్చికి క్వింటాకు 25 వేల రూపాయలు, పసుపుకు 20 వేల రూపాయల ధర చెల్లించాలని, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, పీ.ఎం.కిసాన్ సమ్మాన్ నిధి 6 వేల మంచి 18 వేలకు పెంచి అమలు చేయాలని నికరమైన డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా స్థానిక రైతులైన అంతయిపల్లి సర్వే నెం.87 లోని 52 ఎకరాల 20 కుంటలు కలెక్టరేట్ కార్యాలయం కోసం కోల్పోయిన రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని. కీసర మండలంలోని చిర్యాల గ్రామం ఎస్.కృష్ణ ఎస్.వెంకటేష్ రైతులకు ధరణి-భూభారతిలోని సమస్యలను పరిష్కరించి పాస్ పుస్తకాల అందివ్వాలని, కేశవాపూర్ రిజర్వాయర్లో సర్వే నెం.104/బి, 105/బి లో కాలువల కోసం భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిప్యూటీ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. దానికి డి.విజయేందర్ రెడ్డి వెంటనే స్థానిక రైతాంగ సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు డి.జి.సాయిల్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక రైతులైనటువంటి అంతాయిపల్లి గ్రామ ప్రజల భూములను తీసుకొని నష్టపరిహారం ఇవ్వకుండా కాలం వెల్లదీస్తున్నారని ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వారి సమస్యలపైన స్పందించాల్సిన అవసరం ఉందని అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కోశాధికారి డి.జి.నరేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింలు, ఏ.బాపు రాజు, ఎన్.వెంకటేష్, డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు సహదేవ్, చీర్ల దర్శన్, చీర్ల కౌసల్య, చీల పద్మ, నరసగారి కమలమ్మ, అక్కుల కలమ్మ, 35 మంది రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు విలువలకు మారుపేరు చంద్ర

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలో సిపిఐ ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యుడు, ఆదర్శ కమ్యూనిస్టు, సిపిఐ విప్లవ రథసేనాని, అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి మహబూబ్ నగర్ సీపీఐ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్ కిషన్ మాట్లాడుతూ ధనిక కుటుంబంలో పుట్టి పెరిగి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆకర్షితులై కమ్యూనిస్టు సిద్ధాంత విలువలను పాటిస్తూ రాజేశ్వర్‌రావు ఆచరిస్తూ వచ్చారన్నారు. సమాజంలో దోపిడి పీడన గురవుతున్న ప్రజలకు అండగా, వారిలో తాను ఒకడిగా వారికి సేవకుడిగా నిలిచారన్నారు. తన తండ్రి ఇచ్చిన తన ఆస్తిని నాకంటూ ఏమి ఉండకూడదని పార్టీకి అప్పగించి 60 సంవత్సరాలుగా ఈ దేశ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. తుది శ్వాస విచ్చే వరకు తను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అమలు జరిపిన మహా వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి సురేష్, కొండపల్లి రాము, కోట కదిర నరసింహ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడాలి

విశాలాంధ్ర - కాప్రా : నిజాం పునాదులను కదలించిన తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచి ప్రజల పక్షాన పోరాటం చేసిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ అన్నారు. చంద్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం, సామాజిక ప్రగతి కోసం నిరంతరం జరుగుతున్న విప్లవ పోరాటాల్లో చంద్ర వ్యక్తిత్వం గుర్తించబడినదని, 8 శతాబ్దాల పైగా తాడిత, పీడిత ప్రజల సేవల్లో ఆయన రాజకీయ జీవితం అజేయమైనదిగా నిరూపితమైనదని వారు అన్నారు. కృష్ణాజిల్లాలో ప్యూడలిజం దొరలకు, జమీందారులకు, జాగీరుదారులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని కొనసాగించి రైతాంగంలోనూ. గ్రామీణ పేద ప్రజానీకంలోనూ చైతన్యాన్ని పురికొల్పారన్నారు. దాదాపు 4 దశాబ్దాలకు పైగా చల్లపల్లి జమీందారులకు వ్యతిరేకంగా విరోచిత పోరాటం సాగించడం ద్వారా 2500 ఎకరాల జమీందారు భూములను భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంచిపెట్టారన్నారు. 40వ దశకంలో అప్పటి నిజాం ఆంధ్ర ప్రాంతమైన హైదరాబాద్ సంస్థానంలో నిజాం రాచరికానికి, వెట్టి చాకిరికి, భూస్వామ్య విధానానికి, వ్యతిరేకంగా ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే ధ్యేయంగా ఎంచుకొని రైతులను, వ్యవసాయ కార్మికులను సమైక్యం చేసి సాయుధ పోరాటంలో చంద్ర నిర్వహించిన పాత్ర మరువలేమని వారు ఉద్ఘాటించారు. జీవితం కడక్షణం వరకు కమ్యూనిస్టుల ఐక్యత కోసం, అసంఖ్యాక భారత జనవాళికి విముక్తికోసం తపించిన చంద్ర జీవితం పోరాటాలకు సిద్ధాంత నిబద్ధతకు పర్యాయపదమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, రాఘవేంద్రరావు, సాయిలు, కిరణ్, మురహరి, నదీమ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో వెనుకబడిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయటంలో అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు చెందిన నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని బుధవారం జరిగిన కమిషన్ సమావేశంలో బీసీ కమిషన్ తీర్మానించినట్లు కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. కమిషన్ గత నెల పర్యటించిన వేములవాడ, జగిత్యాల, సిరిసిల్ల, ఆమన్‌గల్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో సంచార జాతులవారి పరిస్థితి హృదయ విదారకంగా ఉండటం గమనించినట్లు చెప్పారు. ఈ కులాలకు సంబంధించిన వారికి ఉండటానికి ఇళ్ళు, ఉపాధికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉన్నది. రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా ఈ కులాల వారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, బ్యాంకులు కూడా వారికి తోడ్పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. జాతీయ బీసీ కమిషన్‌కు ఉన్న అధికారాలను రాష్ట్ర బీసీ కమిషన్‌కు కల్పించాలని కోరుతూ ఒక తీర్మానం చేయడం జరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చే విషయమై పరిశీలించాలని కమిషన్ భావిస్తుందన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ కులాల సర్వే 2024 ద్వారా సేకరించిన సమాచారాన్ని వెంటనే బీసీ కమిషన్‌కు నివేదిస్తే, ఆయా కులాలకు సంబంధించిన విషయాలపై బీసీ కమిషన్ ఒక నిర్ణయం తీసుకోవటానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీలో 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ, 2 బిల్లులు ఆమోదించిన తర్వాత అవి చట్ట రూపం ధరించే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని, అందుకు రాష్ట్రంలోని అన్ని పక్షాల వారు, కుల సంఘాల వారు సహకరించాలని కోరుతూ బీసీ కమిషన్ ఒక తీర్మానం చేసింది.

ఆడంబరమెరుగని ఆదర్శ నేత చంద్ర రాజేశ్వరరావు

విశాలాంధ్ర - హైదరాబాద్, శేరిలింగంపల్లి : భారతకమ్యూనిస్ట్ పార్టీలో అత్యున్నత స్థానంలో ఉన్న తానొక గొప్ప సిద్ధాంతవేతననే బడాయిని ప్రదర్శించక చంద్ర రాజేశ్వర్ రావు ఆడంబరమెరుగని ఆదర్శ నేత అని సిపిఐ సీనియర్ నాయకులూ కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అన్నారు. కమ్యూనిస్ట్ యోధుడు చంద్ర రాజేశ్వర్ రావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్, కొండాపూర్, సీఆర్ ఫౌండేషన్ లోని అయన విగ్రహానికి సిపిఐ సీనియర్ నాయకులు స్వాతంత్ర సమరయోధులు కందిమల్ల ప్రతాపరెడ్డి, సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పిడికిటి సంధ్యాకుమారి ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి వి.చెన్నకేశవరావు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ శ్రీమతి జోశ్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోస్న, వి. లలిత, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కందిమల్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో భారత జాతీయ ఉద్యమంలోనూ, స్వాతంత్ర ఉద్యమంలోనూ, సంస్థాన విలీనద్యమలోను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జమీందారీ జాగిరదారి భూస్వామ్య వ్యవస్థ నిర్మూలించడంలో చంద్ర రాజేశ్వర్‌రావు నిర్వహించిన పాత్ర చెప్పుకో తగినదని, పార్టీ చీలి క్లిష్టమై పరిస్థితులలో ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టి, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణంలోను కృషి మరువలేదనన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక వాద రక్షణకు మరియు దేశ సమైక్యతకు కృషిచేసిన గొప్ప మానవతావాది అని తెలిపారు. వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు రాజేందర్‌రావు, డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్యా, డాక్టర్ పి. సరస్వతి, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తివిద్యా కోర్సుల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన సిలిండర్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్, డిజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దాహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై చిన్న చూపు చూస్తూ సిలిండర్ ధరలను పెంచుతున్నారని ఇప్పటికి 9 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని దీనివల్ల ప్రజలపై మరింత భారం పడుతుందని పెంచిన సిలిండర్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మోది దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రఘు, బస్వం, అందే మోహన్, జాప్రత్ ఖాన్, వీరేశం, ముబారక్, ఆమెర్, ఖదీర్, విజయ్ కుమార్ రెడ్డి, అన్వార్, సందీప్ గౌడ్, నాగమణి, కృష్ణవేణి, లక్ష్మణ్, సతయ్య, దిలీప్ పాల్గొన్నారు.

రాజీలేని పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజీలేని పోరాటాలతోనే ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారమైతాయని, ఇందుకు బలమైన ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్ కోరారు హైదరాబాద్, హిమాయత్ నగర్, మఖ్దూమ్ భవన్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా 4వ మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఆర్.అంజయ్య నాయక్ పాల్గొని మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ మహా నగరంలో గిరిజనుల ముఖ్యంగా లంబాడా తెగకు చెందిన ప్రజలు ఇంటి స్థలాలు లేక మురికి వాడల్లో నివసిస్తున్నారని, వారికి ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. ఇళ్లులేని పేద గిరిజనులకు డబల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని అయన డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా గిరిజన యువతకు రుణ సౌకర్యం కల్పిస్తున్న ట్రై కార్‌లో పెండింగ్‌లో ఉన్న 219 కోట్ల ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేసి, శాంక్షన్ అయి, చెక్కులు సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, గిరిజన సమాఖ్య నాయకులు ఆర్.శంకర్ నాయక్, చందు నాయక్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షులుగా రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా హరి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ నాయక్, ఉపాధ్యక్షులుగా రాజు నాయక్, శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దశరథ్ నాయక్‌లను మహాసభ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది.

అందరి లక్ష్యం ఒక్కటే కావాలి : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : వివిధ రంగాల్లో ప్రజలకు సేవ చేస్తున్న మన అందరి లక్ష్యం ఒక్కటే కావాలని, అది మహబూబ్ నగర్ అభివృద్ధే అయ్యి ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జరిగిన ఓ కార్యక్రమంలో మహబూబ్ నగర్ "విద్యా నిధికి" టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల భారీ విరాళాన్ని ఎమ్మెల్యే సమక్షంలో టీఎన్జీవో నాయకులు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది గొప్ప మార్పు అని నేను భావిస్తున్నాను అని, పేద విద్యార్థుల కోసం సమకూర్చే విద్యా నిధి అనే యజ్ఞంలో మీరు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. మీరు ఇచ్చే ప్రతి పైసా కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యకోసం, పాఠశాలలో అవసరమైన వనరులు సమకూర్చడం కోసం, విద్యార్థులకు స్కిల్స్ పెంచడానికి, సాంస్కృతిక వారసత్వాన్ని అందించడానికి, సమగ్రమైన అభివృద్ధి కోసం ఈ మహబూబ్‌నగర్ విద్యా నిధిని వినియోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ మహబూబ్ నగర్ విద్యా నిధికి చేయూత ఇస్తున్నారని ఆయన చెప్పారు. మన మహబూబ్ నగర్ పిల్లలకు మంచి విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, అందుకే మనం మహబూబ్ నగర్ లో ఉండే ప్రతి ఒక్కరూ తమ సంవత్సర సంపాదన లో కేవలం ఒక్క రోజు సంపాదన మహబూబ్ నగర్ విద్యా నిధికి విరాళంగా అందించాలని ఆయన ఉద్యోగులకు, వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, టీఎన్జీఓ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రా నాయక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో జై బాపూ జై భీం, జై సంవిధాన్ ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్‌లో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా బిజెఆర్ నగర్‌లని బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి, నిరుపేదల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీం, డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, నాయకులు అశోక్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, ఎస్.ఆర్.ప్రసాద్, చంద్రశేఖర్, ఇందిరా ప్రియదర్శిని, శ్రీనివాస్, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ గౌడ్, ప్రవీణ్, వినోద్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, ఫరీద్, ఇస్తారి, ఆశ, ప్రభ, రోజా రమణి, శారద, లాస్య, రాహుల్, కిషోర్, రంగమ్మ, సలీమ్, ఎండి అక్తర్, ఎండీ మసీద్ పాల్గొన్నారు.

పీర్జాదిగూడ-కాచవని సింగారం రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన తుంగతుర్తి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ నుండి కాచవని సింగారం వరకు నిర్మాణంలో ఉన్న ప్రధాన రహదారిపై జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశమై, ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తవడమే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే మార్గమని రవి పేర్కొన్నారు. అంతేకాక, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలనీ, పనుల తీరుపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు.

నల్లాకు మోటర్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా..!

విశాలాంధ్ర - హైదరాబాద్ : నల్లాల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఓ అండ్ ఎమ్ సీజీఎం, జీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జలమండలి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తోం దని, కాబట్టి.. నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. రానున్నరోజులలో నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని వృథా చేయకూడని విజ్ఞప్తి చేశారు. అలాగే నల్లలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగ దారులకులో ప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించా రు. వేసవిలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు సాధ్యమైన అన్ని మార్గాలపై జల మండలి ప్రత్యే దృష్టి సారించింది. ఇప్పటి వరకు తాగునీరు సరఫరాలో ఎలాంటి కొరత లేనప్పటికి కొందరు వినియోగదారుల తీరుతోలో ప్రెషర్ (తక్కువ ఒత్తిడి)తో నీటి సరఫరా సమస్య ఉత్పన్నం కావడాన్ని జలమండలి సీరియస్‌గా పరిగణించింది. నల్లాకు అక్రమంగా మోటర్లు బిగించే కనెక్షన్ దారులపై కొరఢా ఝులింపించాలని నిర్ణయించింది. జరిమానాలు, మోటర్ సీజ్‌కు సిద్ధమైంది. కొందరు నల్లాలకు మోటర్లు బిగిస్తుండటంతో 60 శాతం కనెక్షన్ దారులకు హైప్రెషర్‌తో సమృద్ధిగా నల్లా నీరు సరఫరా, మోటరు లేని 40 శాతం వినియోగదారులల్లో 20 శాతం సాధార ణంగా, మరో 20 శాతం లో-ప్రెషర్‌తో కూడిన నీరు సరఫరా అవుతుండటంతో మెట్రో కస్టమర్ సెంటర్(ఎంసీసీ)కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పటి మాదిరిగానే నల్లా నీటి విడుదలలో సమయ పాలనా పాటిస్తున్నా, లోప్రెషర్ ఫిర్యాదుల తాకిడి ఎగబాగుతుండంతో ఇటీవల జలమండలి వాస్తవ పరిస్థితిపై థర్డ్ పార్టీ ద్వారా ఆరా తీసింది.

నీటి సరఫరా సమయంలో నల్లాలకు మోటర్లు బిగిస్తున్నట్లు గుర్తించింది. నీటి ప్రెషర్ కోసం కోసం వినియో గించే సాధారణ మోటర్లతోపాటు తాజాగా మార్కెట్‌లో వచ్చిన ఆటోమెటిక్ మెటర్ల కూడా వినియోగిస్తుండటంతో హైస్పీడ్ ప్రెషర్ పెరిగి దిగువ, చివరి కనెక్షన్‌దారులకు నీటిసరఫరా అంతంతమాత్రంగా తయారైనట్లు బయటపడింది. నల్లా లకు బిగించే సాధారణ మోటర్లు ఆన్ చేస్తే పనిచేస్తుండగా, ఆటోమెటిక్ మోటర్లు నల్లా సరఫరా ప్రారంభంకాగానే ఆటోమెటిక్‌గా పని చేయడం ప్రారంభిస్తుండటంతో మిగితా కనెక్షన్లకు ప్రెషర్ కూడిన నీటి సరఫరా సమస్యగా తయారైంది.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : విద్యా సంవత్సరం ముగిస్తున్న విద్యార్థులకు ఫీజుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రశ్నించారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజుల బకాయిలు ఉండటం వల్ల హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడు తూ ఇంతవరకు ప్రభుత్వం 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థుల ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదనీ, ఒకవైపు వార్షిక పరీక్షలు వచ్చాయనీ, కాలేజీ యాజమాన్యా లు విద్యార్థుల హాల్ టికెట్లు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు పరీక్షలు రాస్తామా లేదా, అనే తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజుల బకాయిలు 4 వేల కోట్లు దశల వారీగా విడుదల చేయాలని కోరారు. ఫీజుల బకాయిలు చెల్లించక పోతే విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశం కోల్పోతాయని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వేలకోట్లు చెల్లిస్తుందనీ, చదువుకునే విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా అన్యాయం చేస్తుందన్నారు. గతంలో స్కాలర్ షిప్ లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పునః ప్రారంభ చేసామన్నారు. అయిన ప్రభుత్వానికి బుద్ధి రాలేదని, ఇప్పుడు అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు కలిపి నిరవదికంగా బంద్ చేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15నెలలు నడుస్తున్న ఇంతవరకు బకాయిలు చెల్లించడానికి ముందుకు రావడంలేదని విమర్శించారు. ఈ 15 నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు లక్ష 50వేల కోట్లతే ఆదాయం ఒక లక్ష 20వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు, ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మణికంత, రాజేందర్, అనంతయ్య, జి.కిరణ్, రాందేవ్ మోదీ, ఉమేష్, శివ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ పెంచాలి...ఈడీ మయాంక్ మిట్టల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ జలమండలి అధికారులతో బుధవారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ రెవెన్యూ పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు అధిక బకాయి ఉన్న కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రతినెల బోర్డుకు మరింత ఆదాయం సమకూరనుందని ఈడీ తెలిపారు. అలాగే వాణిజ్య కనెక్షన్ల బకాయిలపైన దృష్టి సారించాలని, దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించని వాణిజ్య కనెక్షన్ల నుంచి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి ఈఎన్సీ-ఆపరేషన్ డైరెక్టర్ - 2 వివిఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ -1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు పాల్గొన్నారు.

చల్లివేంద్రం ఏర్పాటు : మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి చౌరస్తాలో గోగికర్ అరుణ్ కుమార్ (కంటెస్టెడ్ కార్పొరేటర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, మల్కాజిగిరి ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, అశోక్ రెడ్డి, ఎస్.ఆర్.ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాస్ సీనియర్ నాయకులు సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, శంకర్, ఆలేటి సాయి బాబా, యువరాజ నాయకులు చరంజీత్ గౌడ్, సాయి కిషోర్, సురేష్ సింగ్, సయ్యద్ మబ్బు, పిట్టల నాగరాజు, నిరుగొండ వినయ్, సంజు, నిరుగొండ నరేందర్, మహిళ నాయకులు శారద, నజియా, లక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినా గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కొత్తగూడ చౌరస్తాలో కే చందు యాదవ్ అధ్యక్షతన ర్యాలీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సభ్యులు సిపిఐ రామకృష్ణ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో పేదవాడి బతుకు ఆగమ్య గోచరంగా మారిందని అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతూ ఉంటే భారతదేశంలో మాత్రం డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేదవాడు బతుకు భారంగా మారిపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చందు యాదవ్, కే సుధాకర్, తుపాకుల రాములు, ఎస్ కొండల్, కే లక్ష్మమ్మ, టి వరలక్ష్మి, బి నారాయణ, శ్రీనివాస్, కే శివకుమార్, ధర్మ తేజ పాల్గొన్నారు.

శంకర్ గౌడ్‌కు నివాళులర్పించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు కొమరగౌని శంకర్ గౌడ్ మృతి చెందిన విషయం తెలియగానే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కాజా గూడలో వారి నివాసానికి వెళి శంకర్ గౌడ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించి, వారి కుటంబ సభ్యులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరామర్శించారు. శంకర్ గౌడ్ మృతి చెందడం చాలా బాధకరమైన విషయం అని, వారికి సద్గతి ప్రాప్తించాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనసారా ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, మంత్రిప్రగడ సత్యనారాయణ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండ రెడ్డి అన్నారు. విద్యా, వైద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిన నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారులు)పై ఉందన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భవన్‌లో వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక అధ్యక్షులు బాదావత్ రాజ్ కుమార్ అధ్యక్షతన సమావేశా నికి ముఖ్యఅతిథిగా కోదండరెడ్డి హాజరై ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీ-2025ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కోదండ రెడ్డి మాట్లాడుతూ ఏఈఓ లే దాక్టర్లని, రైతులతో వీడ తీయరాని బంధం ఉంటుందని, వ్యవసాయాన్ని గాడిన పెట్టే అపార అనుభవం ఉందని ఏఈఓలను ఉద్దేశించి అన్నారు. ఏది ఆగినా వ్యవసాయం ఆగదని, వ్యవసాయంలో కార్పొరేట్లు ప్రవేశించ వద్దన్నారు. రైతుకు, ఏఈఓస్‌కు సెలవు ఉండదని, సమస్యలు ఉంటే తెలియజేయా లన్నారు. ఐక్య వేదిక అధ్యక్షులు రాజ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ క్లస్టర్లను సాగుభూమి ఆధారంగా విభజించాలని, రైతు వేదిక నిర్వహణ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఏఈఓలకు కొత్త ట్యాబ్ లను ఇవ్వాలన్నారు. విస్తరణ అధికారులకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యదర్శి కళ్యాణి, కోశాధికారి పి.ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ తిరుపతయ్య, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సునీత, ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడు లింగయ్య పాల్గొన్నారు.

చిన్నారుల పెరుగుదల, అభివృద్ధిపై ఉచిత స్క్రీనింగ్, కౌన్సిలింగ్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఆటిజం అవగాహనా నెలను (ఏప్రిల్) పురస్కరించు కుని, హైదరాబాద్‌లోని అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ (అనన్య సిడిసి) రెండు సంవత్సరాల లోపు చిన్నారుల పెరుగుదలలో అభివృద్ధిపై ఉచిత స్క్రీనింగ్ తల్లిదండ్రులకు, కేర్ టెకర్స్‌కు కౌన్సిలింగ్ నిర్వహిస్తోంది. ఆటిజం సోసైటీ ఆఫ్ ఏపీ, తెలంగాణ వ్యవస్థాపకురాలు, అనన్య సిడిసి డైరెక్టర్, అలాగే ఆటిజంతో జీవిస్తున్న 25 ఏళ్ల కుమారుడితో అనుభవం ఉన్న తల్లిగా మాధవి ఆదిమూలం ఆటిజం లక్షణాలను తొందరగా గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. "ప్రారంభ దశలోనే స్క్రీనింగ్ జోక్యం చేసుకోవడం అన్నది పిల్లల అభివృద్ధి, జీవిత నాణ్యతకు కీలకమైనవి. గర్భదశ తొలి 1,000 రోజులు, అంటే రెండవ జన్మదినం వరకు, మానసికాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన సమయం. ఈ దశలో పిల్లల ప్రవర్తనలో, వారి అభివృద్ధిలో ఏమైనా తేడాలు అనిపిస్తే వారికి సత్వరం సరైన మద్దతు, స్పీచ్ థెరపి, ఆక్యుపేషనల్ థెరపి ఇవ్వడం వల్ల ఆటిజం వంటి పరిస్థితులపై గణనీయమైన ప్రభావం చూపించవచ్చు. అనన్య సిడిసి తల్లిదండ్రులు, సంరక్షకులు, వైద్య నిపుణులు, ఉపాధ్యాయులను అభివృద్ధి దశలు ముందస్తు జోక్యపు అవసరంపై మరింత అవగాహన కలిగించడానికి పిలుపునిస్తోంది. నా 26 ఏళ్ల కుమారుడు వరుణ్‌కు తల్లిగాను, అనన్య సిడిసి స్థాపకురాలిగాను, ఆటిజం లక్షణాలను ముందస్తుగా తెలుసుకోవడం తగిన సమయానికి అందించే మద్దతు ఎంత ప్రభావశీలమో నేను ప్రత్యక్షంగా అనుభవించాను అని మాధవి అన్నారు. ఈ ఆటిజం అవగాహనా నెలలో, పిల్లల అభివృద్ధి స్క్రీనింగ్‌పై అవగాహన పెంచడానికి, అపోహలను తొలగించడానికి, తల్లిదండ్రులు తొందరగా మార్గనిర్దేశం పొందేలా ప్రోత్సహించడానికి మనం కృషి చేయాలన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలి

విశాలాంధ్ర - కొత్తూరు : అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కొత్తూరు మున్సిపాలిటీలో గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితులు చాలా దయనీయంగా ఉన్నాయని, రోడ్డు ప్రమాదాలలో చిన్న చిన్న గాయాలు తగిలినా వారిని మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. మున్సిపల్‌లో నిధులు ఉన్నప్పటికీ వీరి సేఫ్టీ కోసం, వేరే సంక్షేమం కోసం అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులు అయినప్పటికీ వారాంతపు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వాలు జీవోలు విడుదల చేస్తున్నప్పటికీ ఇక్కడ అమలు కాకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు పండగ సెలవులు ఇవ్వడం లేదని, జాతీయ సెలవులు కూడ అమలు కావడం లేదని మండిపడ్డారు. వీరికి గుర్తింపు కార్డులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశాడు. ఏప్రిల్ 12న జరిగే జిల్లా మహాసభలో మున్సిపల్ కార్మికుల సమస్యల మీద చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు సంజీవ, జంగయ్య, దేవమ్మ, మంజుల, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిటీ సివిల్ కోర్ట్‌లు, ఇంటిగ్రేటెడ్ కోర్ట్స్ ఆన్ ఫామిలీ డిస్ప్యూట్స్ హౌస్‌కీపింగ్ కాంట్రాక్టులకు టెండర్లు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని సిటీ సివిల్ కోర్ట్స్ అలాగే హైదరాబాద్‌లోని కల్పతారు కాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్ట్స్ ఆన్ ఫ్యామిలీ డిస్ప్యూట్స్ ప్రాంగణాల్లో వార్షిక నిర్వహణ హౌస్ కీపింగ్ కాంట్రాక్టుల కోసం ప్రఖ్యాతి గల అనుభవజ్ఞులైన సర్వీస్ అందించేందుకు ఆసక్తిగల నిర్వాహకుల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి వై.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ సమర్పణకు చివరి తేదీ: 19 ఏప్రిల్ 2025 అని, ఆసక్తిగల నిర్వాహకులు టెండర్ వివరాలు అలాగే నిబంధనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చునని అలాగే సంబంధిత కోర్టు అధికారులను సంప్రదించ వచ్చునని సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ చీఫ్ జడ్జి ఆ ప్రకటనలో తెలిపారు.

ప్లాస్టిక్ సంచులు, కవర్లను వాడవద్దు : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: మున్సిపా లిటీ పరిధిలో వ్యాపారులు, చిరువ్యాపా రులు ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌లో బాగంగా స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీ పరిధిలోని కిరాణా షాపులు, హొటల్స్,చికెన్ మటన్ దుకాణాలపై రైడ్ చేసి సింగల్ యూస్ ప్లాస్టిక్ ఉపయోగించే వారికి 8500 జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ కిరాణాషాపులు హొటల్స్, రెస్టారెంట్లలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ (120 మైక్రోన్) కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ను వాడకూడదని, ఈ కవర్ల వాడకం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలియజేశారు. అదేవిధంగా ప్లాస్టిక్ బదులు అందరూ జూటు బ్యాగులు చేతి కర్ర సంచులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహప్రవేశ కార్యక్రమంలో కొలను శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: బుధవారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయ కులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయులు సత్యప్రసాద్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు కొలను శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, మధుసూదన్ రెడ్డి, ఫణి, ప్రసాద్, వరగాని వాసు, మౌలేశ్వరరావు, ప్రశాంత్ రెడ్డి రాయుడు వెంకటరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - అమనగల్లు : బీజేపీ తోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ శ్రేణులు తెలిపారు. అమనగల్లు మండల, మున్సిపాలిటీ కేంద్రాల్లోని గ్రామాలలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తోందని ఆరోపించారు. దేశ ప్రజల భవిష్యత్ కోసం నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చలన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ గోరటి నర్సింహా, బీజేపీ మండల అధ్యక్షులు ఎర్రవోలు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ దస్తావేజులు తయారుచేసిన ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - కాప్రా : భూ సంబంధిత నకిలీ దస్తావేజులు తయారు చేసి అమాయక ప్రజలకు అమ్ముతున్న మూటను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్ కాలనీలోని సర్వే నెంబర్ 99లో గల ప్లాట్ నెంబర్ 60, 61లకు చెందిన 791 చ.గజాల స్థలాన్ని కొందరు స్థానిక రియల్‌టర్లు కలిసి క్రయ విక్రయాలు చేశారు. ఆ స్థలానికి యజమాని లేడు అని గమనించిన రియల్‌టర్లు నకిలీ పత్రాలను తయారు చేసి తక్కువ ధరకే విక్రయించారు. సదరు యజమాని అచ్యుత్ నాయర్ గత 12 ఏళ్ల క్రితమే చనిపోగా అతని కొడుకు విశ్వనాథ్ నాయర్ తమ స్థలం కబ్జాకు గురైందని తెలుసుకొని కేరళ నుండి వచ్చి గత నెల 21వ తేదీన నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి నకిలీ పత్రాలను సృష్టించిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మల్లాపూర్ బాబానగర్‌కు చెందిన దొంతుల శ్రీనివాస్, మల్లాపూర్ గోకుల్‌నగర్‌కు చెందిన ఆసి రెడ్డి కృష్ణారెడ్డి, పన్నాల యాదిరెడ్డి, నాచారం చెందిన వెంకటేశ్వరరావులు ఉన్నారు.

సీఆర్ స్ఫూర్తితో హక్కులు సాధించుకుందాం

- రాజ్యాంగ హక్కులకు మోదీ తిలోదకాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఉద్యమ శిఖరం చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: ఉద్యమ శిఖరం... సుదీర్ఘ కాలం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఏకైక నాయకుడు చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో కంట్రోల్ రూం వద్ద ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి రామకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 26 సంవత్సరాల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నేతృత్వం వహించి, గురుతర నాయకుడిగా చంద్ర రాజేశ్వరరావు ప్రత్యేకత చాటుకున్నారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసింది తొలితరం నాయకులు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ప్రపంచంలోనే ప్రసిద్ధ చెందిన తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి దున్నే వాడికే భూమి, పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఘనత వారికే దక్కుతుందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, లౌకిక వాదం అమలు కోసం పెద్ద ఎత్తున కృషి చేశారని గుర్తు చేశారు. 13 సంవత్సరాల మోదీ పాలనలో రాజ్యాంగానికి రక్షణ లేకుండా పోయిందని, లౌకిక వాదాన్ని మట్టు పెట్టేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఇందులో భాగంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తీసుకొచ్చి దేశ వ్యాప్తంగా వక్ఫ్ భూములు, దేవాలయాల భూములు, క్రైస్తవ ఆస్తులపై పెత్తనం చెలాయించేందుకు చట్టసభల్లో ఆ బిల్లును ఆమోదింపజేసుకున్నారని తెలిపారు. ఈ బిల్లును అడ్డుకునేందుకు సుప్రీం కోర్టులో సవాలు చేయనున్నామన్నారు. ప్రమాదంలో పడిన రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక వాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు దేశంలోని ప్రజాస్వామ్య వాదులందరూ ముందుకు రావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు వాదులందరూ సమైక్యంగా పోరాడి హక్కులు సాధించుకున్నప్పుడే చంద్ర రాజేశ్వరరావుకు ఘనమైన నివాళి అని తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సీపీఐ జెండాను పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, పార్టీ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, ప్రొఫెసర్ సి.నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాసర్ జి, పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి.భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు, సంగుల పేరయ్య, డి.వి.రమణబాబు, తూనం వీరయ్య, కె.ఆనందరావు, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కె.ఆర్.ఆంజనేయులు, వియ్యపు నాగేశ్వరరావు, ప్రజానాట్య మండలి నాయకులు ఆర్.పిచ్చయ్య, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయి కుమార్, నాయకులు టి.వెంకటేశ్వరావు, కె.కృష్ణ, ఆర్.మైకేల్, జి.దుర్గారావు, ఎస్.లక్ష్మణరావు కొండేటి శ్రీనివాసరావు, మురుగేషన్ రాము, ఎస్.కె.బాషా, చింతాడ పార్వతి, బెవర శ్రీను, శ్రీనివాసరావు, పి.రాజు, విజయవాడ ట్యాక్సీ సొసైటీ వర్కర్స్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోదీ ప్రజావ్యతిరేక విధానాలు ప్రతిఘటించాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పెడన: కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ అన్నారు. దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా బుధవారం కృష్ణా జిల్లా పెడనలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పేరిశెట్టి కాంతారావు అధ్వర్యంలో కరపత్రికలు పంపిణీ చేశారు. రైల్వే గేట్ సెంటర్ నుంచి బంటుమిల్లి రోడ్డు ... ప్రధాన రహదారి మీదుగా బస్టాండ్ సెంటర్, మహాత్మా గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నల్లధనం విదేశాల నుంచి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారని, ప్రతి సంవత్సరం యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికారని, పెద్ద నోట్లు రద్దుచేసి నల్లధనాన్ని బయటకి తెస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించారని అన్నారు. జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 11 సంవత్సరాల మోదీ పాలనలో దేశం ఆర్థికంగా వెనుకబడిపోయిందన్నారు. మతోన్మాద శక్తులు, కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం అయిందని విమర్శించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, .పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం పిలుప్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు ఎం. యలమందరావు, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు కట్టా హేమ సుందరరావు, యక్కల పితాంబరేశ్వర రావు, తుమ్మాచిన కొండయ్య, బళ్ళ. మల్లికార్జున రావు, కుర్మా విగ్నేశ్వర రావు, పేరిశెట్టి విజయకుమార్, నున్న ఈశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు న్యాయం చేయండి

రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కోర్టు తీర్పులు బాధాకరం: దుర్గాభవాని

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): బాధిత మహిళలకు న్యాయం అందని ద్రాక్షలా మారిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, బాధిత మహిళలకు న్యాయం జరిగేలా తీర్పులు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పిలుపులో భాగంగా బుధవారం మహిళా సమాఖ్య విజయవాడ నగర సమితి అధ్వర్యంలో గాంధీనగర్ తాలూకా కార్యాలయ సెంటర్‌లో చిన్నారులు, మహిళలపై జరిగిన లైంగిక వేధింపులు, అత్యాచార కేసుల తీర్పులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం కేసుల తీర్పు కాపీలను దగ్ధం చేశారు. అనంతరం దుర్గాభవాని మాట్లాడుతూ... నేరాల బారినపడి మాన ప్రాణాలు పోగొట్టుకుని, న్యాయం కోసం న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్న బాధితులకు కోర్టుల్లో న్యాయం జరగకపోగా మహిళా హక్కులను, రాజ్యాంగ సూత్రాలను తిరస్కరించేవిగా కోర్టు తీర్పులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ, భద్రత కోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకోకపోగా కుల, మత, రాజకీయ, సాంఘిక పరమైన జోక్యంతో తీర్పులు వెలువడుతున్నాయని అన్నారు. అవి న్యాయ వ్యవస్థ పై నమ్మకాన్ని పోగొడుతున్నాయని విమర్శించారు. 2025, మార్చి 17న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ... పోక్సో కేసులో ఇచ్చిన తీర్పు మహిళా లోకాన్ని ఆవేదనకు గురిచేసిందన్నారు. చాలా కేసుల్లో బాధిత మహిళకు న్యాయం కంటే దోషులకు ఊరట కలిగించే తీర్పులు వెలువడటం బాధాకరమన్నారు. న్యాయ వ్యవస్థపై రాజ్యాధికార జోక్యం ఉండకూడదన్నారు. వివిధ రాష్ట్రాల హైకోర్టు తీర్పులపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణతో పాటు న్యాయ మార్గదర్శకాలను పాటించేలా చూడాలని ఆమె కోరారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ చట్టంలో లొసుగుల ఆధారంగా నిందితులు తప్పించుకుని నిర్దోషిలా చెలామణి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అధ్యక్షులు ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, నిలాపు భాగ్యలక్ష్మి, ఎస్‌కె. నాగుర్ బి, ప్రభావతి, వేలాంగని రాణి, ఝాన్సీ, మల్లేశ్వరి, జి.మణి కుమారి, జి.కుమారి, షణ్ముఖ ప్రియ, శ్రీలత పాల్గొన్నారు.

జగన్‌కు భద్రత ఇస్తున్నాం...

హోం మంత్రి అనిత

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సాధారణ ఎమ్మెల్యేకు వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ వర్తిస్తుందని, పులివెందుల ఎమ్మెల్యే అయినప్పటికీ జగన్‌మోహన్ రెడ్డికి జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని, మాజీ ముఖ్యమంత్రిగా ఆయన పర్యటనలలో భద్రత కల్పిస్తున్నామని, కేవలం రచ్చ చెయ్యాలనే వైసీపీ నాటకాలు ఆడుతోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖపట్నం రేంజ్‌లో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, మన్యం (అల్లూరి సీతారామరాజు) జిల్లాల పోలీసు అధికారులతో బుధవారం శ్రీకాకుళంలో సమీక్షా సమావేశం జరిగింది. డీజీపీ సమక్షంలో జరిగిన ఈ సమీక్షలో శాంతిభద్రతలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, సాంకేతిక సాధనాల వినియోగంపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ జగన్ రాప్తాడు పర్యటనలలో 1,100 మంది పోలీసులతో సెక్యూరిటీ కల్పించామన్నారు. అక్కడి పోలీసు అధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున జన సమీకరణ చేశారని తెలిపారు. హెలికాప్టర్‌కు సాంకేతిక సమస్య ఏర్పడిందని పైలెట్ చెప్పారంటున్న వైసీపీ నాయకులను... మరల 10 నిమిషాల్లోనే హెలికాప్టర్ గాల్లో ఎలా ఎగిరిందని ప్రశ్నించారు. ప్రజలు సంతృప్తి చెందేలా పోలీసు శాఖ విధులు నిర్వహిస్తోందని, ఆధునిక సాంకేతిక సాధనాలతో నేరాలను సమర్థంగా అదుపు చేయగలుగుతున్నామని వెల్లడించారు. అన్ని వసతి గృహాలు, పాఠశాలల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గంజాయి సాగు 100 ఎకరాల వరకు తగ్గించామని, 24 నుంచి 48 గంటల్లో కేసులు ఛేదించి నిందితులను అరెస్టు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురానా, అదనపు ఎస్పీ పి.సౌమ్య లత, అదనపు ఎస్పీ పి.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల అమ్మకం అవాస్తవం

వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వక్ఫ్ బోర్డు ఆస్తులు అమ్ముతున్నామనే ప్రచారం అబద్ధమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డు ఆస్తులపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఎంతో ఆలోచించి నిర్ణయాలు చేస్తామన్నారు. 69 వేల ఎకరాల పైచిలుకు వక్ఫ్ బోర్డు భూములుండగా అందులో 36వేల ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. మిగిలిన భూముల నుంచి వచ్చే రెవెన్యూ ద్వారానే వక్ఫ్ బోర్డు ఉద్యోగులకు జీతాలు, పేద ముస్లింలకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఏ పని చేయాలన్నా నిధులు అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు ఆదాయం పెంచేందుకు ఖాళీగా ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఇవ్వాల్సిందిగా వివిధ సంస్థలను కోరామన్నారు. అందుకు చాలా సంస్థలు ముందుకు రాగా ముఖ్యంగా యూకే, దుబాయ్ దేశాల నుండి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారన్నారు. అలా సూచనలిచ్చిన సంస్థలు, వాటి పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే... ఆ తర్వాత టెండర్లకు వెళ్లటమా లేదా అనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు వక్ఫ్ బోర్డు ముందుకు వెళుతుందన్నారు. ఇది టెండర్ల ప్రక్రియ కాదన్నారు. ఈ రోజుకీ వక్ఫ్ బోర్డు ఆస్తులు, రికార్డులు తెలంగాణలోనే ఉన్నాయని, 70 శాతం నిధులు అక్కడే ఆగిపోయాయన్నారు. తాను చైర్మన్ అయిన తరువాత తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలవటం జరిగిందన్నారు. హిందూ దేవాలయాల ఆస్తులు ఏ విధంగా కాపాడుతారో అదే విధంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా కాపాడాలని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు, దేవుడి ఆస్తులని ఎవ్వరికీ అమ్మటం కుదరదని, కేవలం లీజుకి మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1 నుండి వక్ఫ్ బోర్డు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నామన్నారు. మంచి చేయాలనే సంకల్పంతో ఉన్న వక్ఫ్ బోర్డుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ట్రంప్ టారిఫ్ ప్రభావంపై

ఆక్వా కల్చర్ సలహా కమిటీ ఏర్పాటు

రైతులు, ఫీడ్, హేచరీస్, ఎంపెడా నుంచి 16 మంది నియామకం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ట్రంప్ టారిఫ్ ప్రభావాన్ని ఎదుర్కొంటూ ఆక్వా రంగాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా కల్చర్ సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఆక్వా ఎగుమతులపై అమెరికా టారిఫ్ సవాళ్లు అధిగమించే చర్యలపై కమిటీ అధ్యయనం చేయనుంది. ఆక్వా ఎగుమతిదారులు, రైతులు, ఫీడ్ కంపెనీ ప్రతినిధులు, హేచరీలు, ఎంపెడాకు చెందిన మొత్తం 16 మంది సభ్యులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయంపై ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాసిన విషయం తెలిసిందే. అమెరికా సుంకాలతో నష్టపోతున్న ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈనెల 7వ తేదీ ఆక్వారైతులు, ఆ రంగానికి చెందిన నిపుణులు, భాగస్వాములు, ఎంపెడా ప్రతినిధులు, ఎగుమతిదారులతో చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించి 100 కౌంట్ రొయ్యలకు రూ.220 కన్నా తగ్గించవద్దని కొనుగోలుదారులకు సూచించారు. ఆక్వా రంగ సమస్యల పరిష్కారం, భవిష్యత్ ప్రణాళిక అందించడానికి ఒక

ఏపీ భవన్‌లో మంత్రి నాదెండ్ల తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ భవన్‌లోని పౌర సరఫరాలశాఖ దుకాణాన్ని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను మంత్రి పరిశీలించారు. తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దుకాణాన్ని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. విక్రయించే బియ్యంలో నాణ్యత లేదన్నారు. 26 కిలోల బియ్యం బస్తాను మంత్రి మనోహర్ చెక్ చేయగా...అది 25 కిలోలు ఉన్నట్లుగా గమనించారు. వేయింగ్ మిషన్ సైతం సరిగా పనిచేయడం లేదన్నారు. నెలలోగా ఏపీ పౌర సరఫరాల శాఖ తరపున రేషన్ స్టోర్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యమైన బియ్యంతో పాటు, సరుకులను అందిస్తామన్నారు. ఈ తనిఖీల్లో మంత్రి నాదెండ్లతోపాటు పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఉన్నారు.

చంద్రబాబుది అభివృద్ధి కాంక్ష

సామాన్య ప్రజల హామీలూ నెరవేర్చాలి: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబుకి అభివృద్ధి కాంక్ష ఉందని, ఆలోచించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తాంని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చంద్రబాబు అమరావతిలో ఇల్లు కట్టుకుంటున్నారు కాబట్టి రాజధాని అభివృద్ధి అవుతుందనీ... లేకపోతే కాదనడం సరికాదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు రాజధాని అమరావతిలో తన ఇంటి నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేయడంపై నారాయణ స్పందిస్తూ... 'చంద్రబాబు ఇంటి భూమి పూజకు మమ్మల్ని పిలుస్తారు అనుకున్నాం... పిలవకుండా ఇంటి నిర్మాణం చేపట్టడం మంచిదే... చంద్రబాబు గతంలోనే ఇల్లు కొనుక్కోవడం, అద్దెకు తీసుకోవడం చేయొచ్చు కానీ వివాదాస్పద నివాసంలో అద్దెకు ఉన్నారని' అన్నారు. గత సీఎం వైఎస్ జగన్ ప్యాలెస్ కట్టుకున్నారనీ, ఏం అభివృద్ధి జరిగింది...చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం వల్లనే అభివృద్ధి అనేదీ కూడా సరికాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు కేంద్రం నుంచి అమరావతికి అందిన సాయం సున్నా అని, గతంలో అమరావతి విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, 2014లో ఒక్క పైసా ఖర్చు లేకుండా చంద్రబాబు 30వేల ఎకరాలు సేకరించి మంచిపని చేశారన్నారని, ప్రస్తుతం అమరావతిలో ఎనిమిది వేల ఎకరాల భూమి ఖాళీగా ఉందని, దానిని డెవలప్‌మెంట్‌కి ఇచ్చినా బ్రహ్మాండమైన రాజధాని నిర్మితం అవుతుందని సూచించారు. అమరావతి మంచిగా అభివృద్ధి చెందుతుందని, ఏపీ రాజధాని బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో చంద్రబాబుకి విజన్ ఉందనీ, చంద్రబాబు విజన్‌కి కేంద్రం సహకరించాలన్నారు. అదానీ, కార్పొరేట్‌లను ప్రసన్నం చేసుకుంటే రాష్ట్రం అభివృద్ధి జరగబోదని, ఈ విషయాన్ని చంద్రబాబు గుర్తెరగాలని హితవు పలికారు. సామాన్య ప్రజానీకానికి ఇచ్చిన హామీలు అమలు చేసుకుంటూ, ఉద్యోగ కల్పన చేసుకుంటూ సమగ్ర అభివృద్ధి దిశగా చంద్రబాబు ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

పంట కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: అకాల వర్షం కారణంగా నష్టపోయిన మామిడి, మొక్కజొన్న రైతులను తక్షణమే రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లాలోని రెడ్డిగూడెంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెండవ రోజు బుధవారం పర్యటించి అకాల వర్షాలకు నేలకొరిన మామిడి తోటలను, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంట నష్టంపై బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈదురు గాలులకు మామిడి చెట్లు విరిగిపోయాయని, వ్యయప్రయాసాలతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. మూడేళ్లుగా వివిధ రకాల తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల తీవ్రతతో నష్టపోయిన చిన్న, సన్నకారు, సామాన్య రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ పర్యటనలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మండల కార్యదర్శి పెండెం కోటేశ్వరరావు, సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాణావతు బాష, పిన్నుబోయిన జమలయ్య, మట్ట కొయ్యబాబు, తిరుపతయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌లో దళారుల దోపిడీ

బృందం ఆకస్మిక తనిఖీలో మోసం బట్టబయలు

విశాలాంధ్ర -అనంతపురం బ్యూరో: స్థానిక మార్కెట్ యార్డులో చీనీ రైతులకు దళారులు చేస్తున్న మోసం బట్టబయలైంది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి సి. జాఫర్, రైతు సంఘం కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు ఎ. కాటమయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. మల్లికార్జున, పండ్లు తోటల సంఘం జిల్లా అధ్యక్షుడు అనంత రాముడు మార్కెట్ యార్డ్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు జరుగుతున్న మోసం.. బృందాన్ని ఆశ్చర్య పరిచింది. మార్కెట్ యార్డ్‌ను స్థావరంగా చేసుకొని బ్రోకర్లు అధికారికంగా రైతుల నుంచి దోచుకుంటున్నారని స్పష్టమైంది. బృందానికి రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కేవలం ఐదుగురు బ్రోకర్ల చేతిలోకి మార్కెట్ యార్డ్ బందీ అయిపోవడం దుర్మార్గమని ఎమ్మెల్యే దగ్గుబాటి జగదీష్ అన్నారు. మీరేం చేస్తున్నారంటూ మార్కెట్ యార్డ్ అధికారులను నిలదీశారు. ఇక నుంచి బహిరంగ వేలం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామి ఇచ్చారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న పరిణామాలపై నెల రోజులుగా నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. జగదీష్ మాట్లాడుతూ అధికారులను సస్పెండ్ చేసి జరుగుతున్న మోసం పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతు నుంచి నాలుగు శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా పది శాతం వరకు వసూలు చేయడం అన్యాయమన్నారు. జాఫర్ మాట్లాడుతూ రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన మార్కెట్ యార్డ్ అధికారులు, దుష్టచర్యలకు పాల్పడటం అన్యాయమన్నారు. మల్లికార్జున మాట్లాడుతూ రైతు పక్షాన ఉద్యమిస్తామని హామీ ఇచ్చారు. బండి రామకృష్ణ, శ్రీనివాసులు, ఎర్రి స్వామి పాల్గొన్నారు.

వైద్యుల పర్యవేక్షణలో పవన్ కుమారుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కి సింగపూర్‌లో చికిత్స కొనసాగుతోంది. మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో బాలుడి కాళ్లు, చేతులకు గాయాలు కావడం.. ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సింగపూర్ వెళ్లిన పవన్ ఆస్పత్రికి చేరుకున్నారు. మార్క్‌శంకర్‌ను చూసిన అనంతరం వైద్యులతో ఆయన మాట్లాడారు. మార్క్ కోలుకుంటున్నాడని... ఊపిరితిత్తుల్లో పొగ పట్టేయడం మూలంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందులపై పరీక్షలు చేస్తున్నామని వైద్యులు పవన్‌కు తెలిపారు. మార్క్ శంకర్‌కు తొలుత అత్యవసర వార్డులో చికిత్స అందించిన వైద్యులు బుధవారం ఉదయం గదికి మార్చారు. మరో మూడు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచి మరికొన్ని పరీక్షలు చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. పవన్‌తో పాటు చిరంజీవి దంపతులు కూడా సింగపూర్ వెళ్లారు. పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని జనసేన శ్రేణులు రాష్ట్రంలో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చత్తీస్‌గఢ్‌లో అధ్యయనానికి అనుమతివ్వండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాల్పుల విరమణ, శాంతి చర్చలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకుగాను చత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత దంతెవాడ, బస్తర్ తదితర జిల్లాల సందర్శనకు అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ బుజాన్, అధ్యక్షుడు భాస్కర రావు కోరారు. క్షేత్ర స్థాయి పరిస్థితుల నిష్పాక్షిక అంచనాకు, ప్రభావిత వర్గాలకు సంఘీభావం, ప్రతిపాదిత కాల్పుల విరమణ, శాంతి చర్చలకు నిర్దిష్ట విధానానికి తమ అధ్యయనం అవసరమన్నారు. చారిత్రక - రాజకీయ అన్యాయాల గుర్తింపు, వాటికి సమగ్ర పరిష్కారం ఆధారంగా శాంతి చర్చలను చేపట్టడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.